విశాలాంధ్ర నంద్యాల
www.visalaandhra.com
కర్నూలు, మంగళవారం 28, జనవరి 2025

ఉపాధి కల్పించడమే ప్రభుత్వ ధ్యేయం

విశాలాంధ్ర - డోన్ : గ్రామీణ ప్రాంతాల్లో పనులు కోరిన ప్రతి ఒక్కరికి ఉపాధి పనులు కల్పించడమే ప్రభుత్వ ధ్యేయమని డోన్ ఎంపీడీఓ వెంకటేశ్వర రెడ్డి అన్నారు. మండల పరిధిలోని యాపదిన్నే గ్రామంలో దాదాపు మూడు సంవత్సరాలనుండి ఉపాధి పనులు ఆగిపోయాయి. పనులు గ్రామంలో ఉపాధి పనులు కల్పించి వలసలు నివారించాలని ఎన్నికల ముందు అప్పటి అభ్యర్థి,డోన్ శాసనసభ్యులు శ్రీ కోట్ల జయ సూర్య ప్రకాశ్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ కోరగా వారు స్పందించి గ్రామంలో పనులు కల్పించాలని అధికారులను అదేశించారు. ఈ మేరకు సోమవారం ఎంపీడీఓ వెనకటేశ్వర రెడ్డి, ఏ పి ఓ షకూర్ గ్రామానికి వెళ్లి పనులను ప్రారంభించారు. దీంతో గ్రామస్థులు ఎమ్మెల్యే దంపతులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ టిడిపి నాయకులు రంగన్న, డాక్టర్ శ్రీను,కొండయ్య, వీరుపాక్షి, టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రసాయన ఎరువులు అధికంగా వాడరాదు

విశాలాంధ్ర - అవుకు : రైతులు రసాయన ఎరువులు అధికంగా వాడరాదు అని నవభారత్ ఫెర్టిలైజర్స్ ఫీల్డ్ ఆఫీసర్ కృష్ణమూర్తి అన్నారు. సోమవారం మండలంలోని సింగనపల్లి, సుంకేసుల గ్రామాలలో ఎరువుల వాడకంపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటల సాగులో రైతులు రసాయన ఎరువులు వాడకాన్ని తగ్గించి సేంద్రియ జీవన ఎరువులను ఎక్కువగా వాడాలని అన్నారు. రసాయన ఎరువులు అధికంగా వాడడం వలన ఆహార ఉత్పత్తులు విషతుల్యం అవుతాయని అన్నారు. క్రమక్రమంగా భూమిలో భూసారం తగ్గిపోయి జంతు మానవాళికి ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని అన్నారు. పర్యావరణ కాలుష్యం పెరుగుతుందని అన్నారు. సేంద్రియ జీవన ఎరువులను వాడడం వలన పెట్టుబడి తగ్గి అధిక దిగుబడులు సాధించవచ్చు అని అన్నారు.

శివరాత్రికి అంగళ్ల వేలంపాట

విశాలాంధ్ర - గడివేముల : శివరాత్రి ఉత్సవలకు అంగడిల వేలంపాట నిర్వహించమని ఆలయ అధికారి వివిఎల్ఎన్ రామానుజన్ తెలిపారు. మండల పరిధిలోని గడిగరేవుల గ్రామ సమీపంలో వెలసిన శ్రీ దుర్గా భోగేశ్వర స్వామి ఆలయంలో సోమవారం నాడు శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా అంగళ్ళ వేలంపాట ఆలయ అధికారి రామానుజన్ ఆధ్వర్యంలో వేలంపాట నిర్వహించారు. ఐస్, కూల్డ్రింక్స్, చెరుకూరసం బండికి, కళింగర పండు షాపుకు అలాగే సప్లయర్ సామాన్ల దుకాణానికి వేలంపాట నిర్వహించగా అక్షరాలా 3,61,000 రూపాయలు వచ్చిందని, గత సంవత్సరం కంటే అదనంగా 1,28,000 రూపాయల ఆదాయం వచ్చిందని ఆలయ అధికారి రామానుజన్ తెలిపరు. ఈ కార్యక్రమంలో వేలంపాట పర్యవేక్షణ అధికారిగా నంద్యాల గ్రూపు దేవాలయాముల ఈఓ జి.వేణునాథ రెడ్డి, అర్చకులు శ్యాంసుందర్, ఆలయ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

అవసరం మేరకే యూరియా వాడాలి

విశాలాంధ్ర - వెలుగోడు : పంటలకు అవసరమైనంత మేరకు మాత్రమే యూరియా వాడాలని వెలుగోడు మండల వ్యవసాయ అధికారి పవన్ కుమార్ తెలిపారు. వెలుగోడు మండలంలోని వెలుగోడు , బోయరేవుల గ్రామాల్లో రబీలో సాగు చేసిన వరి పొలాలను సోమవారం ఏవో పరిశీలించారు. వారు మాట్లాడుతూ అవసరానికి మించి యూరియా వాడడం వల్ల భూసారం తగ్గుతుందని అన్నారు. మొక్కకు నత్రజని ఇచ్చే ఎరువు అయినప్పటికీ పరిమితికి మించి వేసుకోవడం వల్ల నేల, గాలి కలుషితమవుతున్నాయి. అంతే కాదు చీడపీడల తాకిడి అధికమవడం,వాటి నివారణకు అధిక వ్యయం సాగు ఖర్చు అవుతుంది. ఫలితంగా రైతు నష్టాలపాలవుతున్నారు. అందుకే అధిక ఎరువుల వినియోగాన్ని తగ్గించి అవసరం మేరకే రైతులు ఎరువులు వేసుకోవాలని ఏఓ తెలిపారు. ఒకేసారి మొత్తం యూరియాను వేసుకోకుండా దశలవారీగా వేసుకోవాలి. వరి నాటు వేసేటప్పుడు, పిలక దశలో మరియు చిరు పొట్ట దశలో వేసుకుంటే మొక్కకు బాగా ఉపయోగపడుతుంది. యూరియాతో వేప పిండి కలిపి వేసుకున్నట్లయితే నత్రజని అందుబాటు పెరగడమే కాక చీడపీడల నుండి కూడా రక్షణ లభిస్తుంది. రైతులు రెండు లేదా మూడు దఫాలుగా ఎరువులు వేసుకోవాలని ఏఓ రైతులను కోరారు. ఈ కార్యక్రమంలో ఏవోతో పాటు వ్యవసాయ విస్తరణ సిబ్బంది రామకృష్ణ పాల్గొన్నారు.

మిస్సింగ్ కేసు నమోదు

విశాలాంధ్ర - బనగానపల్లె : పట్టణంలోని విద్యుత్ కార్యాలయంలో షిఫ్ట్ ఆపరేటర్‌గా పని చేసే కోడి రవికుమార్ అనే వ్యక్తి మిస్సింగ్ అయినట్లు కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు బనగానపల్లె యుపిఎస్ సీఐ ప్రవీణ్ కుమార్ సోమవారం వెల్లడించారు. ఈనెల 10వ తేదీన బయటకు వెళ్లిన రవికుమార్ ఇంటికి తిరిగి రాలేదని, బంధువులు, మిత్రుల గ్రామాల్లో వెతికిన కనిపించకపోవడంతో సోమవారం స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

లేబర్ కార్డులు తీసుకోవాలి

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : భవన నిర్మాణ కార్మికులు లేబర్ కార్డులు తీసుకోకుండా ఉంటే వాటిని తీసుకోవాలని నంద్యాల లేబర్ అధికారి విజయ్ కుమార్ అన్నారు. ఆళ్లగడ్డ పట్టణంలో సోమవారం ఎలక్ట్రీషియన్‌డేను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నంద్యాల లేబర్ ఆఫీసర్ విజయ్ కుమార్, జిల్లా కోర్టు ఏపిపి బత్తిని శివప్రసాదరావు హాజరయ్యారు. స్థానిక ఎలక్ట్రీషియన్లు వారిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పిపి శివప్రసాదరావు మాట్లాడుతూ ఎలక్ట్రికల్ కార్మికులందరూ ఒకచోట చేరుకుని ఎలక్ట్రీషియన్ డే వేడుకలు జరుపుకోవడం ఐక్యతకు నిదర్శనం అన్నారు. భవన నిర్మాణాల వద్ద ఎలక్ట్రీషియన్లకు ఏవైనా సమస్యలు ఉంటే లీగల్‌గా పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది శ్రీనివాసులు, సీనియర్ ఎలక్ట్రీషియన్లు షాకీర్, శంకరయ్య, భాస్కర్, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిత్వ వికాస శిక్షణా తరగతులు

విశాలాంధ్ర - ఆత్మకూరు రూరల్ : ఆత్మకూరు మండలం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల నందు 1992-1994 ఆర్ట్స్ గ్రూపుకు సంబంధించిన పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో ప్రధాన అధ్యాపకులు రఘురామాచార్యులు అధ్యక్షత వహించి ఆత్మకూరు పట్టణంలో గల ఇండోర్ స్టేడియం నందు ఇంటర్నేషనల్ మినీ ఇంపాక్ట్ సంస్థ వారిచే విద్యార్థులకు మోటివేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మినీ ఇన్పాక్ట్ నేషనల్ ప్రెసిడెంట్ కె.రామచంద్రుడు నేషనల్ వైస్ ప్రెసిడెంట్ కె.మాధవి మాట్లాడుతూ విద్యార్థులకు వ్యక్తిత్వ వికాస శిక్షనలో భాగంగా మోటివేషన్ స్పీచ్ ఇచ్చి విద్యార్థులలో చైతన్యం నింపి తమ జీవితాలలో ముందుకు ఎలా వెళ్లాలనే విషయాలను విద్యార్థులకు తెలియజేశారు.తదంతరం పూర్వ విద్యార్థులు కళాశాల బృందంతో కలిసి మోటివేషనల్ స్పీచ్ ఇచ్చినటువంటి కె.రామ చంద్రుడు, కె.మాధవి,గోపీనాథ్, మహేంద్రకి శాలువా వేసి మోమెంటంతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

నిరుపేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలి

సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.రామాంజనేయులు..

విశాలాంధ్ర - నంద్యాల అర్బన్ : అర్హులైన నిరుపేదలందరికీ ఇంటి స్థలాలు ఇవ్వాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.రామాంజనేయులు డిమాండ్ చేశారు. నంద్యాల పట్టణ సీపీఐ శాఖ కార్యదర్శుల, సహాయ కార్యదర్శిల ముఖ్య నాయకుల సమావేశం సీపీఐ కార్యాలయంలో హుస్సేన్‌సా అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎన్.రంగనాయుడు, సహాయ కార్యదర్శి బాబా ఫక్రుద్దీన్, సీపీఐ పట్టణ కార్యదర్శి కె.ప్రసాద్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు నాగరాముడు హాజరయ్యారు. అనంతరం సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.రామాంజనేయులు, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎన్.రంగనాయుడు మాట్లాడుతూ నంద్యాల పట్టణంలో అనేకమంది ఇల్లు లేని నిరుపేదలు ఉన్నారు. వారికి ఇళ్ల స్థలాలు ఇవ్వాలని అనేక మార్లు సీపీఐ ఆధ్వర్యంలో ఉద్యమాలు నిర్వహించి ప్రభుత్వానికి తెలియపరచడం జరిగింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సీపీఐ రాష్ట్ర సమితి పిలుపు మేరకు అర్హులైన నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని గత సంవత్సరం నవంబర్ 18వ తారీఖున నిరుపేదలతో వ్యక్తిగత అర్జీలు సచివాలయాలలో అందజేయడం జరిగిందని, అలాగే రెండో విడత ఎమ్మార్వో కార్యాలయం దగ్గర వ్యక్తిగత అర్జీలు ఇవ్వడం జరిగిందని తెలిపారు. మూడో విడత పట్టణంలో ఈనెల 29 నుండి 4వ తారీఖు వరకు అన్ని వార్డులలో ఇల్లు లేని నిరుపేదలతో అర్జీలు, 5వ తేదీన టేక్కే మార్కెట్ యార్డ్ నుండి ఎమ్మార్వో కార్యాలయం వరకు భారీ ప్రదర్శనగా వెళ్లి ఎమ్మార్వోకి వ్యక్తిగత అర్జీలు సమర్పించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి సోమన్న, ఏఐటీయూసీ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు భూమని శ్రీనివాసులు, డి.శ్రీనివాసులు, మహిళా సంఘం నాయకురాలు సుశీలమ్మ, లక్ష్మీదేవి, సీపీఐ పట్టణ శాఖ కార్యదర్శులు సహాయ కార్యదర్శులు సాల మద్దిలేటి, మద్దయ్య, చాంద్ బాషా, మాభాష, నూరు భాష, సిద్దిక్, శీను తదితరులు పాల్గొన్నారు.

ఇష్టానుసారంగా ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రామ్

-విధులకు హాజరుగాని వైద్యాధికారి
-గ్రామీణ వాసులకు అందని మెరుగైన వైద్య సేవలు

విశాలాంధ్ర - రుద్రవరం : గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనె లక్ష్యంతో ప్రభుత్వం ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం ఏర్పాటు చేసింది. వైద్యాధికారుల నిర్లక్ష్యం కారణంగా గ్రామీణ ప్రాంతాలలో నిరుపేద ప్రజలకు వైద్య సేవలు అందడం లేదు. మండలంలో ప్రతినెల ఆయా గ్రామ సచివాలయాల పరిధిలో ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రామ్ ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం అప్పనపల్లి, పందిర్లపల్లి గ్రామాలలో ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి వైద్యాధికారి ఎవరు హాజరు కాకపోవడంతో ప్రజలకు వైద్య సేవలు అందించే వారు కరువయ్యారు. నిబంధనల ప్రకారము ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాంకు కేటాయించిన వైద్యాధికారి హాజరు కావాల్సి ఉంది. ఏ ఒక్కవైద్యాధికారి కూడా ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం కార్యక్రమానికి హాజరు కాకపోవడంతో వైద్యం కోసం వచ్చిన గ్రామీణనిరుపేద ప్రజలు వైద్య సేవలు అందక వెనుతిరిగి పోయారు. ఇష్టానుసారంగా వైద్య అధికారులు విధులు నిర్వహిస్తూ ఉండడంతో గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్య సేవలు అందడం లేదు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్న వైద్య అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామీణ ప్రాంత ప్రజల కోరుతున్నారు.

న్యాయస్థానం ఆదేశాలు భేఖాతర్

-పర్మనెంట్ ఇంజక్షన్ ఆర్డర్ ఉన్న భూమి ఇతరుల పేరు మీద ఆన్లైన్
-చర్యలు తీసుకోవాలంటూ కలెక్టర్‌కు వినతి

విశాలాంధ్ర - శిరివెళ్ల : శిరివెళ్ల తాసిల్దార్ కార్యాలయంపై ఇటీవల పలు ఆరోపణలు అధికమయ్యాయి. గ్రామ, మండల స్థాయి రెవెన్యూ అధికారులపై జిల్లా కార్యాలయానికి ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. జిల్లా కార్యాలయానికి వస్తున్న ఫిర్యాదులు, రెవిన్యూ రికార్డుల నిర్వహణ, విధినిర్వహణలో విమర్శలు, అధికం కావడంతో ఇటీవల నంద్యాల రెవిన్యూ డివిజనల్ ఆఫీసర్ శిరివెళ్ల కార్యాలయానికి వచ్చి పలు సూచనలు సలహాలు హెచ్చరికలు జారీ చేసినప్పటికీ తహాశీల్దార్ కార్యాలయ పరిధిలోని గ్రామా మండల స్థాయి రెవెన్యూ అధికారుల తీరు మారకపోవడం ఫిర్యాదులు వెల్లువెత్తుతూనే ఉన్నాయి తాజాగా శిరివెళ్ల మండలం మహాదేవపురం గ్రామంలోని పొలం నుండి నంద్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి సోమవారం పలు ఫిర్యాదులు అందాయి. అందులో ముఖ్యంగా న్యాయస్థానం ఆదేశాలను కోర్టు ఇచ్చిన పర్మనెంట్ ఇంజక్షన్ ఆర్డర్‌ను లెక్కచేయకుండా ఇటీవల తన పేరు మీద ఉన్న భూమి ఇతరుల పేరు మీద ఆన్లైన్ చేశారని జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. శిరివెళ్ల మండలం గుండంపాడు గ్రామానికి చెందిన ఆర్ బాలసుబ్రమణ్యం అను యువరైతు తన తండ్రి నుండి రిజిస్టర్ ద్వారా 205 సర్వే నెంబర్లో ఒక ఎకరా నాలుగు సెంట్లు విస్తీర్ణం గల సాగు భూమి సంక్రమించినదని తన భూమి తనకు తెలియకుండా ఇతరులకు డబల్ రిజిస్టర్ చేయడం వల్ల నాడు న్యాయస్తానాన్ని ఆశ్రయించి డబల్ రిజిస్టర్ చేసిన అధికారులపై జిల్లా రిజిస్టర్ ఆదేశాల మేరకు కేసు సైతం నమోదు చేసినట్లు పేర్కొన్నారు. అధికారులపై, క్రయవిక్రయదారులపై ఎఫ్ఐఆర్ నమోదు కేసు అయ్యిందని కోర్టు పరిధిలో ఉండి పర్మనెంట్ ఇంజక్షన్ ఆర్డర్ ఇచ్చిందని ఫిర్యాదులో కోర్టు ఉత్తర్వుల నంబరును ద్వారా పొందుపరిచారు. న్యాయస్థాన పరిధిలో ఉన్నటువంటి భూమి తన భూమిని ఇతరుల పేరు మీద ఎలా మార్చారని ప్రశ్నించారు. తన భూమి తనకు దక్కకుండా ఇతరులకు చెందేలా ఆన్లైన్ చేయడంలో ఎంత లబ్ధి పొందారని విమర్శించారు. న్యాయస్థానం ఆదేశాలను తన పేరు మీద ఉన్న రెవెన్యూ రికార్డులను డబల్ రిజిస్టర్ చేసిన వారిపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ను సైతం ఫిర్యాదుతో జత కలిపి జిల్లా కలెక్టర్‌కి, రెవెన్యూ డివిజనల్‌కి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. శిరివెళ్ల తాసిల్దార్ కార్యాలయంలో ఆన్లైన్ మార్పులు చేర్పులు ఇష్టానుసారంగా జరుగుతున్నాయని రైతులను ఇబ్బంది పెడుతున్నారని విమర్శలు వ్యక్తం చేశారు. న్యాయస్థానం ఆదేశాలను లెక్కచేయకుండా పేద రైతులైన తన కడుపు కొట్టి ఇతరుల కడుపు నింపేందుకు ప్రయత్నించి విధి నిర్వహణలో అన్యాయానికి కోర్టుదిక్కార నేరానికి పాల్పడిన సంబంధిత అధికారులపై వెంటనే చర్యలు తీసుకోవాలని బాలసుబ్రమణ్యం ఫిర్యాదులో పేర్కొన్నారు.

ప్రజా ఫిర్యాదులను పరిష్కరించండి

- ఎంఎస్ఎంఈ సర్వేపై దృష్టి పెట్టండి
- జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : ప్రజా సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి నాణ్యతతో వేగంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాలులో జిల్లా నలుమూలాల నుంచి వచ్చిన ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. జిల్లా కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్, డిఆర్ఓ రాము నాయక్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి సారించి నాణ్యతతో పరిష్కరించాలని జిల్లా అధికారులను ఆదేశించారు. మండల, డివిజన్, మున్సిపల్ స్థాయిలో జరిగిన పిజిఆర్ఎస్ మినిట్స్ సిఎంఓ పీజీఆర్ఎస్ గ్రూపులో నోడల్ అధికారికి పోస్ట్ చేయాలన్నారు. రీసర్వే గ్రామసభలు, రెవెన్యూ సదస్సుల ద్వారా స్వీకరించిన దరఖాస్తులను వెబ్ పోర్టల్ లో అప్లోడ్ చేసి నిర్ణీత వ్యవధిలోగా పరిష్కరించడంతో పాటు ఆడిట్ చేయాలన్నారు. పరిష్కరించ దగ్గ ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలన్నారు. పరిష్కరించలేని సమస్యలకు సరైన కారణాలు వివరిస్తూ ఎండార్స్ చేయడంతో పాటు ఏ విధంగా పరిష్కరించగలమో అన్వేషించాలన్నారు. పత్రికల్లో వచ్చే ప్రతికూల వార్తలపై వెంటనే స్పందించి వాస్తవాలు నిర్ధారణ చేసుకొని సరి చేసుకోవడంతో పాటు రీజాయిన్డెర్లు ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు. అన్ని శాఖలు సమిష్టిగా పనిచేసి జిల్లాకు మంచి పేరు తీసుకు రావాలన్నారు. గ్రామ, వార్డు సచివాలయం సిబ్బందిచే ఎంఎస్ఎంఈ సర్వే పూర్తి చేయించాలని మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలను కలెక్టర్ ఆదేశించారు. హౌస్ హోల్డ్ మాపింగ్ సంబంధించి డిఇఓ, పోలీస్, ఇరిగేషన్, రెవెన్యూ, వైద్య ఆరోగ్యం తదితర శాఖలో 68,593 మంది మ్యాపింగ్ పెండింగులో ఉందని రెండు రోజుల్లో పూర్తి చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో 189 మంది అర్జీదారులు తమ సమస్యల పరిష్కారానికి జిల్లా కలెక్టర్ కు అర్జీలు సమర్పించారు. ఈ సమస్యలన్నీ వితిన్ ఎస్ఎల్ఏలోగా పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఎండార్స్ చేస్తూ కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.

పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చేవరకు పోరాటం

విశాలాంధ్ర - నందికొట్కూరు : అర్హులైన నిరుపేదలకు ఇళ్లస్థలాలు ఇంటి నిర్మాణం కొరకు ఐదు లక్షలు మంజూరు చెయ్యాలని సీపీఐ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 3వ తారీఖున తహశీల్దార్ కార్యాలయం ముందు జరుగు అందోళన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీపీఐ కార్యదర్శి శ్రీనివాసులు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సోమవారం పట్టణంలోని నీలి షికారి పేటలో పార్టీ బృందంతో కలిసి ప్రజలతో ఇళ్ల స్థలాల కొరకు దరఖాస్తు చేయించారు. ఈ కార్యక్రమంలో మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి రజిత సీపీఐ నాయకులు మహానంది, దినేష్, తదితరులు పాల్గొన్నారు.

మాతా,శిశు మరణాల నివారణే లక్ష్యం

విశాలాంధ్ర - చాగలమర్రి : మాతా,శిశు మరణాల నివారణే లక్ష్యంగా ఆరోగ్య,కుటుంబ సంక్షేమ శాఖ కిల్కారి మొబైల్ అకాడమీ సేవల కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిందని కిల్కారి మొబైల్ సేవల అకాడమి జిల్లా ప్రోగ్రామ్ అధికారి కీర్తి తెలిపారు. సోమవారం చాగలమర్రి పట్టణం లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆరోగ్య,ఆశ కార్యకర్తలకు కిల్కారి మొబైల్ సేవలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఆమె మాట్లాడుతూ గర్భిణీలు,బాలింతలు తీసుకోవలసిన జాగ్రత్తలు,పాటించాల్సిన ఆహార నియమాలు,వైద్య పరీక్షలు తదితర అంశాలపై అప్రమత్తం చేసేందుకు కిల్కారి పేరిట ఆడియో కార్యక్రమాన్ని ప్రభుత్వం రూపకల్పన చేసిందన్నారు. గర్భిణులు, బాలింతలు 01244451660,14423 నెంబర్లకు కాల్ చేయవచ్చని, ఇది పూర్తిగా ఉచితం అని తెలిపారు. ఎఎన్ఎం వద్ద నమోదు చేసుకున్న నంబర్‌తో చేయాలని పేర్కొన్నారు. వైద్యులు ఇమ్రాన్,అంజలి, సిహెచ్ఓ రమణమ్మ,హెల్త్ఎడ్యుకేటర్ వెంకటమ్మ, సూపర్వైజర్ రాంలింగా రెడ్డి, సీతా రాములు,ఎంఎల్‌హెచ్‌పిలు,ఆరోగ్య,ఆశకార్యకర్తలు పాల్గొన్నారు.

రైతులందరూ నమోదు చేయించుకోవాలి

విశాలాంధ్ర - కొలిమిగుండ్ల : పొలం కలిగిన ప్రతి రైతు ఫార్మర్ రిజిస్ట్రీ నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారిని బి జ్యోతి అన్నారు. సోమవారం స్థానిక మండల వ్యవసాయ కార్యాలయం నందు ఆమె మాట్లాడుతూ ఫార్మర్ రిజిస్ట్రీ నమోదు ఈనెల 26 నుండి మన రాష్ట్రంలో కూడా ప్రారంభమైందన్నారు. కేంద్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు వ్యవసాయ రంగాన్ని డిజిటలైజ్ చేసి పారదర్శకత పెంచడానికి రైతు నమోదు కార్యక్రమం మొదలయ్యిందన్నారు. పొలం ఉన్న ప్రతి రైతు ఆన్లైన్లో రిజిస్టర్ అయి 14 అంకెల విశిష్ట గుర్తింపు సంఖ్యను పొందాలని, ఈ గుర్తింపు సంఖ్య ద్వారానే రాబోయే కాలంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు అందించే అనేక పథకాలు సబ్సిడీలు అందుతాయన్నారు. నమోదుకు సంబంధించి రైతు సేవ కేంద్రాల సిబ్బందికి, వీఆర్వోలకు లాగిన్లు ఏర్పాటు చేశామన్నారు. రైతులందరూ ఆధార్ కార్డు, పొలం 1బి, ఆధార్ కార్డుతో లింక్ అయినా మొబైల్ నెంబర్ తో రైతు సేవా కేంద్రాలను సంప్రదించాలని కోరారు. ఈ అవకాశాన్ని పొలం ఉన్న ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ప్లాస్టిక్ భూతాన్ని తరుముదాం.. పర్యావరణాన్ని కాపాడుదాం

విశాలాంధ్ర-పాణ్యం : నిత్య జీవితంలో ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ భూతాన్ని తరిమి పర్యావరణాన్ని కాపాడుకుందాం అని స్టేట్ డైరెక్టర్ స్రవంతి విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఎన్విరాన్మెంట్ ఎడ్యుకేషన్ ప్రోగ్రాంలో భాగంగా మండల పరిధిలో గల స్కూల్,బలపనూరు కేశవరెడ్డి పాఠశాలలందు సోమవారం విద్యార్థులకు స్టేట్ డైరెక్టర్ స్రవంతి పర్యావరణ అంశాలైన గాలి,నీరు,భూమి, ఆహారము,శక్తి, వ్యర్థాల నిర్వహణ గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ వ్యర్థాలు భూమి మీద ఎక్కువ వాడకుండా భూమిని ఆరోగ్యవంతంగా ఉంచుటకు ప్రతి విద్యార్థి కృషి చేయాలన్నారు. ఈ విషయాలను ఏకో క్లబ్ సభ్యులు సమాజంలోని ప్రతి వ్యక్తికి అవగాహనపరిచి పర్యావరణాన్ని సంరక్షించాలన్నారు. ప్రతి విద్యార్థి పుట్టినరోజు ఒక మొక్కను నాటి పర్యావరణం పట్ల అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా పాఠశాల ఆవరణంలో మొక్కను నాటడం జరిగినది. త్వరలో జరగబోయే పరీక్షల యందు 100% సాధించాలని, అధికమార్కులతో విద్యార్థులు పాస్ కావాలన్నారు. ఈ కార్యక్రమంలో స్టేట్ ప్రాజెక్ట్ ఆఫీసర్స్ సత్యనారాయణ, ప్రసాద్,మండల విద్యాశాఖ అధికారి 2 సుబ్రహ్మణ్యం పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీదేవి, వైస్ ప్రిన్సిపాల్ శ్రీలక్ష్మి,జిల్లా కోఆర్డినేటర్ చంద్రశేఖర్ రెడ్డి,క్లస్టర్ కోఆర్డినేటర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

మందుబాబులకు అడ్డాగా 'ప్రభుత్వ పాఠశాల'

విశాలాంధ్ర - శిరివెళ్ల : తమ గ్రామంలోని చిన్నారులకు విద్యాబుద్ధులు నేర్పి ప్రయోజకులుగా తీర్చిదిద్దేందుకు పునాది వేస్తున్న సరస్వతీ నిలయం ప్రభుత్వ పాఠశాల. సాయంత్రం అయ్యేసరికి మందుబాబులకు అడ్డగా మారి పోయింది. ప్రభుత్వ పాఠశాల ఆవరణం మద్యం తాగి పడేసిన కాళీ మద్యం సీసాలు ప్లాస్టిక్ గ్లాసులు ఇతర వ్యర్థ పదార్థాలతో నిండిపోతున్నదని గగ్గోలు పెడుతున్న సంఘటన శిరివెళ్ల మండలం, జీనపల్లే గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో చోటు చేసుకుంటున్నది. అక్షరాలు దిద్దుకొని విద్యాబుద్ధులు నేర్చుకొని పంతులు చెప్పిన చెప్పిన హోంవర్క్ తిరిగి అప్పగించాలని బడికి వచ్చే చిన్నారులకు మద్యం సీసాలు తాగి పడేసిన ప్లాస్టిక్ గ్లాసులు తిని పడేసిన చికెన్ ఎముక ముక్కలు ప్లాస్టిక్ కవర్లు ఇతర ఆయిల్ ఫుడ్ వస్తువులు చూడాల్సిన రావడం ఎక్కడ గాజు పెంకులు చికెన్ ముక్కలు కాళ్లకు గుచ్చుకుంటాయి అన్న భయంతో వాటిని శుభ్రం చేసుకోవడంలో విద్యార్థిని విద్యార్థులు సతమతమవ్వాల్సిన దౌర్భాగ్యం ఏర్పడిందని గ్రామ ప్రజలు కొందరు పేర్కొంటున్నారు. జీనపల్లి గ్రామం చుట్టూ సాగునీరు ఉండడం పాఠశాల సమీపంలోనే పంట కాలువ ఉండడం వల్ల అసలే దోమల తాకిడి ఉన్నదని ఈమందు బాబులు తాగి పడేసిన వ్యర్థ పదార్థాల కారణంగా పంట పొలాల్లో , కాలువల్లో ఉన్నటువంటి ప్రమాదకరమైన దోమలు పాఠశాలలోకి ప్రవేశిస్తున్నాయని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డెంగ్యూ మలేరియా టైఫాయిడ్ వంటి జబ్బులు విద్యార్థులకు సంక్రమించే అవకాశం ఉందని భయాందోళన చెందుతున్నారు. శిరివెళ్ల మండల విద్యాశాఖ అధికారి సందర్శించాలని, శిరివెళ్ల పోలీసులు మందుబాబుల సిట్టింగును ప్రభుత్వ పాఠశాలలో లేకుండా వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు సూచిస్తున్నారు.

సెమినార్ హాల్ నిర్మాణానికి రూ.లక్ష విరాళం

విశాలాంధ్ర - కోవెలకుంట్ల : మండల పరిధిలోని వాసవి బొమ్మి డాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల సెమినార్ హాల్ నిర్మాణానికి లక్ష రూపాయల విరాళం తేగులపల్లి సదాశివ రెడ్డి ఇచ్చినట్లు కళాశాల వైస్ ప్రిన్సిపల్ యు.రామ సుబ్బారెడ్డి సుబ్బారెడ్డి తెలిపారు. అనంతరం సదాశివారెడ్డినీ కళాశాల ప్రిన్సిపల్ సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఇ.వి.భాస్కర్ రెడ్డి, ఐ.నాగేశ్వర్ రెడ్డి, డాక్టర్ కె.రాజశేఖర్, ఎ.లక్ష్మీదేవి, పి. అన్నపూర్ణ, ఎ.కృష్ణ దాసు, విద్యార్థులు పాల్గొన్నారు.

అధికారికంగా వాసవి మాత ఆత్మార్పణ దినోత్సవం

ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపిన ఆర్యవైశ్య సోదరులు

విశాలాంధ్ర-అవుకు : ఆర్యవైశ్యుల ఇలవేల్పు శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలని కూటమి ప్రభుత్వం జీవో జారీ చేయడం చాలా సంతోషంగా ఉందని ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మేడం ఆంజనేయులు అన్నారు. సోమవారం స్థానిక వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు కృతజ్ఞతలు తెలిపే సమావేశాన్ని ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మేడం ఆంజనేయులు, ఆర్యవైశ్య సంఘం జనరల్ సెక్రటరీ తల్లం సుబ్బ నాగభూషణం అధ్యక్షతన సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మేడం ఆంజనేయులు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో వాసవి మాత ఆత్మార్పణ దినోత్సవాన్ని అధికారికంగా చేపడతామని తెలుగుదేశం జనసేన బిజెపి కూటమి మేనిఫెస్టోలో పేర్కొందని అనంతరం ఎన్నికల్లో ఘనవిజయం సాధించి అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం వాసవి మాత ఆత్మార్పణ దినాన్ని అధికారికంగా నిర్వహించాలని జీవో జారీ చేసిందని అన్నారు. జనవరి 31వ తేదీన శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆత్మర్పణ దినోత్సవాన్ని అధికారికంగా పెనుగొండలోని అమ్మవారి ఆలయంలో నిర్వహించనున్నట్లు ఉత్తర్వులు జారీ చేయడమే కాకుండా సాక్షాత్తు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పెనుగొండ పుణ్యక్షేత్రాన్ని సందర్శించి అమ్మవారి ఆశీస్సులు పొందనుండడం విశేషం అని అన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు, రాష్ట్ర మంత్రి టీజీ భరత్‌కి కృతజ్ఞతలు తెలుపుకుంటున్నామని అన్నారు. ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షుడు తాల్లేపల్లి నాగేంద్ర, పెండేకంటి సాయి ప్రసాద్, సన్నితి చంద్రుడు, కొండూరు వెంకటసుబ్బయ్య, తాడేపల్లి నాగ సుబ్రహ్మణ్యం, జూటూరు సత్యనారాయణ, జీవీ సుబ్రహ్మణ్యం, గుటూరు సుదర్శనం, పశుపల అశ్వత్థ నారాయణ,వంకదారి సతీష్,మేడం రవిశంకర్,శివప్రసాద్, సంతోష్, మల్లెల బాబి, తాలేపల్లి బాబు, తాడేపల్లి కిషోర్, బచ్చు ప్రవీణ్, రాపూరు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నూతన గృహాన్ని సందర్శించిన మాజీ సర్పంచ్

విశాలాంధ్ర - బనగానపల్లె : మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి మిట్టపల్లి గ్రామం నందు గుండం విజయ నాగేశ్వర్ రెడ్డి, విశాలాంధ్ర విలేఖరి, గుండం హరికృష్ణ రెడ్డి గృహప్రవేశానికి అందుబాటులో లేకపోవడంతో వారి ఆహ్వానం మేరకు సోమవారం నాడు నూతన గృహాన్ని సందర్శించి వారి ఆతిథ్యాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ యడమ కంటి తులసి రెడ్డి, టిఎస్ఆర్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, కుందం వెంకట సుబ్బారెడ్డిలు పాల్గొన్నారు.

మరిన్ని వార్తలు E-PAPERలో

విశాలాంధ్ర కర్నూలు
www.visalaandhra.com
కర్నూలు, మంగళవారం 28, జనవరి 2025

రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం మేరకు ఇంటి స్థలాలు పేదలకు ఇవ్వాలి : సీపీఐ

విశాలాంధ్ర - కర్నూలు: రాష్ట్ర క్యాబినెట్ ఆమోధం మేరకు ప్రభుత్వం పేదలకు గ్రామీణ ప్రాంతంతో మూడు సెంట్లు, పట్టణ ప్రాంతంలో రెండు సెంట్ల స్థలం ఇవ్వాలని సీపీఐ నగర కార్యదర్శి పి.రామకృష్ణారెడ్డి ప్రభుతాన్ని డిమాండ్ చేశారు. సోమవారం సీపీఐ రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా దిన్నే దేవరపాడు గ్రామ సచివాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నగర సహాయ కార్యదర్శి డి.శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ఈ ధర్నా కార్యక్రమాన్ని ఉద్దేశించి పి.రామ కృష్ణారెడ్డి, సహాయ కార్యదర్శి సి.మహేష్‌లు ధర్నా నుద్దేశించి మాట్లాడుతూ దిన్నెదేవరపాడు గ్రామపంచాయతీ అయిన వెంగన్న బావిలోనే అంబేద్కర్ నగర్ వాసులకు ఇంటి స్థలంలేని వారి ఇంటి స్థలం ఇవ్వాలన్నారు. ఈ విషయంపై క్యాబినెట్ తీర్మానం చేయడం జరిగిందని, తక్షణమే అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఏపీ మహిళా సమైక్య నగర కార్యదర్శి భారతి మాట్లాడుతూ మహిళలు అధిక సంఖ్యలో రాష్ట్ర ప్రభుత్వానికి ఓట్లు వేసి గెలిపించడం జరిగిందన్నారు. తక్షణమే మహిళల పేరు మీద ఎలాంటి షరతులులేని ఇంటి స్థలాలు మంజూరు చేయాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నగర కార్యవర్గ సభ్యులు నాగరాజు, బీసన్న, నగర నాయకులు మాణిక్యం, రాముడు, ఇండ్ల స్థలాల బాధితుల కమిటీ కన్వీనర్ లక్ష్మమ్మ, మునెమ్మ, రబియా, రాణి పాల్గొన్నారు.

మద్యం మత్తులో విద్యార్థులను చితకబాదిన హెడ్మాస్టర్

విశాలాంధ్ర - హొళగుంద: మండలంలోని ముద్దట మాగి మండల ప్రాథమిక పాఠశాలలో హెడ్మాస్టర్‌గా పని చేస్తున్న జయరాజు మద్యం మత్తులో సోమవారం విద్యార్థులను చితకబాదాడు. రోజు మాదిరిగా మద్యం తాగే అలవాటు ఉండడంతో బాత్రూంలోకి వెళ్లి మద్యం తాగుతుండగా విద్యార్థులు హెడ్మాస్టర్ మద్యం తాగుతున్న దృశ్యాన్ని చూశారు. దీంతో హెడ్మాస్టర్ కోపోద్రిక్తుడై ఐదో తరగతి చదివే విద్యార్థులు లావణ్య, బాలాజీలను చేతులకు, వీపులకు తీవ్రంగా కొట్టడంతో గాయాల పాలయ్యారు. విద్యార్థులపై దాడి చేయడంతో ఎస్ఎంసీ కమిటీ చైర్మన్ దేవేంద్ర, గ్రామ ప్రజలు హెడ్మాస్టర్‌ను జరిగిన సంఘటనను విచారించి నిలదీశారు. రోజు మద్యం సేవించి విధులకు హాజరవుతున్న హెడ్మా స్టర్ మాకు వద్దంటూ పాఠశాలకు తాళం వేసి ఎస్ఎంసీ చైర్మన్, ప్రజలు ఆందోళన చేశారు. విద్యార్థులపై దాడి చేసిన విషయాన్ని అడిగితే మాస్టర్ తమపై ఆగ్రహిస్తూ ఏమి చేసుకుంటారో చేసుకో అంటూ గదమాయించారని ప్రజలు వాపో యారు. విద్యార్థులపై దాడి చేసిన హెడ్ మాస్టర్‌పై చర్యలు తీసుకోవాలంటూ ఎంఈఓ-2 జగన్నా థంకు ప్రజలు ఎస్ఎంసి కమిటీ చైర్మన్ ఫిర్యాదించారు. ఎంఈఓ-2 జగన్నాథం సంఘటనపై విచారించి, జిల్లా విద్యాశాఖ అధికారికి నివేదిక సమర్పించారు. ఎంఈఓ2 జగన్నాథం మాట్లాడుతూ ప్రజలు ఫిర్యాదించారని హెడ్మాస్టర్‌కు ఎన్నోసార్లు పద్ధతి మార్చుకోవాలంటూ చెప్పామని, ఉపాధ్యాయులు ప్రజలకు ఆదర్శంగా ఉండాల్సిన వారు పాఠశాలలో మద్యం తాగి విధులకు హాజరవడం తప్పని అన్నారు.

ఉపాధ్యాయుడు సస్పెండ్

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్: హొళగుంద మండలం ముద్దటమాగి ఆదర్శ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు జయరాజు మద్యం మత్తులో విద్యార్థులను చితకబాదిన ఘటనలో ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేస్తూ జిల్లా విద్యాధికారి ఎస్.శ్యామ్యూల్ పాల్ ఉత్తర్వులు జారీ చేశారు. పాఠశాల టాయిలెట్‌లో మద్యం సీసాలను గుర్తించిన విద్యార్థులు, మద్యం సీసాలు చూశారన్న ఆగ్రహంతో విద్యార్థులను చితకబాదినట్లు ఎంఈఓ జగన్నాథం నివేదిక ఇచ్చారని, నివేదిక ఆధారంగా సస్పెండ్ చేసినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి తెలిపారు.

ఉత్తమ బీఎల్వోకు కమిషనర్ అభినందనలు

విశాలాంధ్ర - కర్నూలు సిటీ : కర్నూలు నియోజకవర్గంలో బూత్ స్థాయిలో అత్యుత్తమ సేవలు అందించి, ఈ నెల 25న ఓటర్ల దినోత్సవం నాడు విజయవాడలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్‌చే ప్రశంస పత్రం అందుకున్న 133వ పోలింగ్ కేంద్రం బిఎల్వో వినుకొండ ఈరమ్మను కర్నూలు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, నగరపాలక కమిషనర్ ఎస్.రవీంద్ర బాబు అభినందించారు. సోమవారం నగరపాలక కార్యాలయంలో కమిషనర్‌ను ఈరమ్మ కలిసి, తాను అందుకున్న ప్రశంస పత్రం, రూ.5 వేల నగదు, జ్ఞాపిక చూపించారు. సేవలను అభినందించిన కమిషనర్, ప్రతిభకు ఎప్పుడు గుర్తింపు ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో మేనేజర్ ఎస్.చిన్నరాముడు, సూపరింటెండెంట్ సుబ్బన్న, క్లర్క్ జీఎం శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

విషరహిత కూరగాయలు, ఆకుకూరలను వాడాలి

విశాలాంధ్ర - సి.బెళగల్: ప్రకృతి వ్యవసాయంలో పండించిన విషరహిత కూరగాయలను, ఆకుకూరలను వాడాలని మండల వ్యవసాయ అధికారి జి.మల్లేష్ కుమార్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం ముందు ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్‌ను మండలం వ్యవసాయ అధికారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. మండలం కేంద్రంలో సోమవారం ప్రజా ఫిర్యాదులు పరిష్కార వేదిక సందర్భంగా ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు ప్రత్యేక స్టాల్ ద్వారా అమ్మకం ప్రారంభించి వ్యవసాయ అధికారి అవగాహన కల్పించారు. వ్యవసాయ అధికారి మల్లేష్ కుమార్‌తో పాటు ఎన్ఎఫ్ఏ జగదీష్, ఎంటీ వెంకటేష్ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన

విశాలాంధ్ర - పెద్దకడబూరు: మండల పరిధిలోని హనుమాపురం శివారులో ఉన్న ఎస్ఎంఎల్ డిగ్రీ కళాశాలలో ఎస్ఐ నిరంజన్ రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థులకు సైబర్ నేరాలపై ఎమ్మిగనూరు డీఎస్పీ ఉపేంద్ర బాబు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ నేరాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణ, మహిళలపై జరిగే నేరాల పట్ల అవగాహన కల్పించారు. విద్యార్థులు క్రమశిక్షణ కలిగి ఉండి ఆత్మవిశ్వాసం పెంపొందించుకొని జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించి హితవు పలికారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సుశీలమ్మ, అధ్యాపకలు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొల్పాలి

విశాలాంధ్ర - కర్నూలు సిటీ: నగరంలోని అన్న క్యాంటీన్ల వద్ద ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొల్పాలని నగరపాలక కమిషనర్ ఎస్.రవీంద్ర బాబు సూచించారు. సోమవారం వై.జంక్షన్ సమీపంలోని పరిమళ నగర్ అన్న క్యాంటీన్‌ను కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్న క్యాంటీన్ల వద్ద ప్రతిరోజూ శుభ్రత పనులు చేపట్టాలని, పరిసరాల్లో మొక్కలు పెంచాలన్నారు. నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ మూడు పూటలా పేదలకు ఆహారం అందించాలని, మెనూ తప్పనిసరిగా పాటించాలని నిర్వాహకులకు సూచించారు.

బస్తిపాడులో సువార్త కూడికలు

విశాలాంధ్ర -కల్లూరు: మండల పరిధిలోని బస్తిపాడు గ్రామంలో ఈనెల 28, 29 తేదీలలో రెండు రోజులపాటు సువార్త కూడికలు నిర్వహిస్తున్నట్లు ఏబీఎన్ సంఘ పెద్దలు వాల్ పోస్టర్లను విడుదల చేశారు. ఈ మేరకు సోమవారం బస్తిపాడు గ్రామంలో ఏబీఎన్ చర్చి సంఘ పెద్దల ఆధ్వర్యంలో సువార్త కూడికల వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘ పెద్దలు మాట్లాడుతూ డిటి క్రిష్ట ఫర్ సేవకులు ముఖ్య అతిథులుగా పాల్గొని వాక్యోపదేశం యువనున్నట్లు తెలిపారు. సాయంత్రం 5 గంటల సమయంలో గ్రామంలోని దళితవాడలో ఉన్న కమిటీ హాల్ ఆవరణంలో రెండు రోజులపాటు సువార్త కూడికలు నిర్వహిస్తున్నామని, ఈ కూడికలకు ప్రతి ఒక్కరు పాల్గొని, జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఇతర గ్రామాల నుండి వచ్చే వారికి సంఘమా ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఏబీఎన్ చర్చి సంఘ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

మద్దతు ధరపై కందుల కొనుగోలు

విశాలాంధ్ర- వెల్దుర్తి: మార్క్ ఫెడ్ వారి ఆధ్వర్యంలో కనీస మద్దతు ధర రూ.7550 కందుల కొనుగోలు స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో రైతు సేవా కేంద్రంలో ప్రారంభం. మండలంలోని రైతు సోదరులందరూ గ్రామాలలోని రైతు సేవా కేంద్రాలను సంప్రదించి కందులు మద్దతు ధరపై అమ్ముటకు వ్యవసాయ శాఖ అధికారి అక్బర్ బాషా తెలిపారు. ఎకరానికి 5 క్వింటాల వరకు ఒక్క రోజుకు 40 క్వింటాల చొప్పున 100 క్వింటాల వరకు ఒక్కొక్క రైతు నుండి కొనుగోలు చేయుటకు అవకాశం ఖరీఫ్ 2024లో కంది సాగు చేసి పంట నమోదు చేసుకున్న రైతులకు మాత్రమే అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పత్తికొండ ఏడీఏ మోహన్ విజయ్ కుమార్, తేజ వర ప్రసాద్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ మార్క్‌ఫెడ్, కర్నూలు మాజీ ఎంపీపీ ఎల్ఈ జ్ఞానేశ్వర్ గౌడు, మండల అధ్యక్షుడు బలరాం గౌడ్, యువ నాయకులు రమాకాంత్ రెడ్డి, సుధాకర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రూ.10 వేల మద్దతు ధర ప్రకటించాలి

విశాలాంధ్ర- తుగ్గలి: కందులు ప్రభుత్వం 7550 కొనుగోలు చేయడంపై సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు నభిరసూల్ అసహనం వ్యక్తం చేశారు.సోమవారం మండల కేంద్రమైన తుగ్గలి రైతు భరోసా కేంద్రంలో రైతులతో ఏపీ మార్క్ ఫెడ్, నాఫెడ్ ఆధ్వర్యంలో కందుల కొనుగోలు పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సదస్సును ఉద్దేశించి ఏఓ పవన్ కుమార్ మాట్లాడుతూ ప్రతి రైతు నుండి హెక్టారుకు మూడున్నర క్వింటం చొప్పున ఒక్కొక్క రైతు నుండి నలభై క్వింటాలు కొనుగోలు చేయనున్నట్లు ఏఓ తెలిపారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు నభిరసూల్ మాట్లాడుతూ ప్రభుత్వం క్వింటానికి 7550 చెల్లించడం సబబు కాదని గత నెల కిందటే రూ.10 వేలు, రూ.9 వేలు, రూ.8 వేల చొప్పున రైతులు కందులను విక్రయించిన సంగతి తెలిసిందే నన్నారు. ప్రభుత్వం మద్దతు ధర 10 వేల రూ ఇస్తుందే మోనని రైతులు ఎదురు చూస్తున్నారన్నారు. ఏఓ పవన్ మాట్లాడుతూ ఈ విషయాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్తామని తెలిపారు. సర్పంచ్ రవి, ఎమ్పీటీసీ రాజు, టీడీపీ మాజీ జిల్లా చేర్మెన్ బత్తిన వెంకట్రాముడు, మాజీ ఎమ్పీపీలు కొమ్ము వెంకటేశ్వర్లు, చంద్రశేఖర్, మనోహర్ చౌదరి, వెంకటస్వామి, వల్లే వెంకటేష్ పాల్గొన్నారు.

డీఈవో అభినందించిన మాంటిస్సోరి విద్యా సంస్థల యాజమాన్యం

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్ : 76వ గణతంత్ర దినోత్సవ సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.సామెల్ పాల్‌ను ఆయన ఛాంబర్‌లో మాంటిస్సోరి స్కూల్ వెంకటేశ్వర్లు, యోహా ను, పూలే బొకేతో అభినందించడం జరిగింది.

జాతీయ స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌కు రిడ్జ్ విద్యార్థులు

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్: స్థానిక లక్ష్మీపురం సమీపంలోని రిడ్జ్ పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్న విద్యార్థులు రీతు సింధు, షెర్లిన్ సంజీవ్‌లు గతేడాది నవంబర్ 11, 12 తేదీల్లో విజయవాడలో నిర్వహించిన సీబీఎస్ఈ రీజనల్ సైన్స్ ఎగ్జిబిషన్లో మొదటి బహుమతి సాధించి, జాతీయస్థాయి ఎగ్జిబిషన్‌కు ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులు ఈ నెల 30 నుండి ఫిబ్రవరి 1 వరకు హర్యానా రాష్ట్రంలోని గురుగ్రామ్‌లో జరిగే జాతీయస్థాయి సైన్స్ ఎగ్జిబిషన్లో పాల్గొంటున్నట్లు పాఠశాల సీఈఓ గోపీనాథ్ తెలిపారు. జాతీయ స్థాయిలోతమ విద్యార్థులు అద్భుత ప్రతిభను కనబరచాలని తమ ఆకాంక్షను వెలిబుచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కో- సీఈఓ సౌమ్య గోపీనాథ్ డీన్ రాజేంద్రన్, ప్రిన్సిపాల్ రాజ్ కమల్ పాల్గొన్నారు.

2025 క్యాలెండర్ విడుదల

విశాలాంధ్ర - కర్నూలు : విద్యుత్ మీటర్ రీడర్స్ యూనియన్ రాష్ట్ర క్యాలెండర్‌ను ఏఐటీయూసీ జిల్లా కార్యాలయంలో విడుదల చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.మునెప్ప, మీటర్ రీడర్స్ యూనియన్ కర్నూలుజిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జి.రాజు, హమీద్, ఏఐటీయూసీ నగర కార్యదర్శి జి చంద్రశేఖర్, విద్యుత్ మీటర్ రీడర్స్ నగర నాయకులు నాగార్జున, అయస్వామి, లతీఫ్ పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలి

విశాలాంధ్ర-పత్తికొండ: మండలంలోని దూదేకొండ గ్రామంలో కొత్తపల్లికి వెళ్లే రోడ్డు సైడ్ కాలనీలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని ఏఐటీయూసీ నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు నెట్టికంటయ్య, రంగన్న డిమాండ్ చేశారు. సోమవారం కాలనీ వాసులతో కలిసి తహాశీల్దార్ ఎంపి రమేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాలనీలో జలజీవన్ మిషన్ కింద ఇంటింటికి కుళాయిలు ఏర్పాటు చేసిన, తాగునీరు సరఫరా కావడంలేదని, అధికారులు సమస్య పరిష్కారానికి కృషి చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు రాజప్ప, కాలనీవాసులు ఎల్లప్ప, రఫీ, హుస్సేన్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఏఐఎస్ఎఫ్ 2025 క్యాలెండర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర - కోడుమూరు : ఏఐఎస్ఎస్ జిల్లా సహాయ కార్యదర్శి బి.రంగస్వామి ఆధ్వర్యంలో అఖిల భారత విద్యార్థి సమాఖ్య 2025 సంవత్సర క్యాలెండర్‌ను మండల సబ్ ఇన్స్పెక్టర్ ఎపీ శ్రీనివాసులు ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఏఐఎస్ఎఫ్ విద్యార్థుల హక్కుల కోసం అలుపెరుగని పోరాటం చేసిందని తెలిపారు. బీకేఎంఎస్ తాలుకా కార్యదర్శి శేషు కుమార్ యాదవ్, ఏఐఎస్ఎఫ్ కోడుమూరు మండల అధ్యక్ష, కార్యదర్శి వీరేంద్ర, అల్తాఫ్ బాష తదితరులు పాల్గొన్నారు.

ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలి : సీపీఐ

విశాలాంధ్ర-పత్తికొండ: రాష్ట్రవ్యాప్తంగా ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య, ఏఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కారుమంచి, జిల్లా అధ్యక్షులు శ్రీరాములు గౌడ్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక చదువుల రామయ్య భవనంలో ఏర్పాటుచేసిన ఏఐవైఎఫ్ మండల సమితి సమావేశానికి హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల ముందు చంద్రబాబు నాయుడు నిరుద్యోగ యువతకు అనేక హామీలు ఇచ్చారని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే నిరుద్యోగ భృతి నెలకు మూడు వేల రూపాయలు ఇస్తామన్న హామీని, అధికారం చేపట్టి ఎనిమిది నెలలు పూర్తికావస్తున్న ఇంతవరకు అమలు చేసింది లేదని విమర్శించారు. నిరుద్యోగ యువకులు ఎదుర్కొంటున్న సమస్యలపై యువత ఉద్యమాలు చేపట్టేందుకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి డి.రాజా సాహెబ్, ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు హనుమేష్, పెద్దయ్య, అహ్మద్, దస్తగిరి, రవి, తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక: ఏఐవైఎఫ్ మండల అధ్యక్షులుగా ఉపేంద్ర, ఉపాధ్యక్షులుగా మోహన్, ప్రధాన కార్యదర్శిగా అల్తాఫ్, సహాయ కార్యదర్శిగా ఇమ్రాన్, కోశాధికారిగా విజయ్‌లను ఎన్నుకోవడం జరిగిందని తెలిపారు.

కార్పొరేట్ విద్యాసంస్థల ఫీజుల దోపిడీని అరికట్టాలి

విశాలాంధ్ర - ఆదోని క్రైం: కార్పొరేట్ విద్యాసంస్థల ఫీజుల అక్రమ దోపిడీని అరికట్టాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు దస్తగిరి డిమాండ్ చేశారు. సోమవారం సబ్ కలెక్టర్కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల మరణాలకు కేంద్రబిందువులుగా మారుతున్న నారాయణ, చైతన్య భాష్యం కళాశాలల గుర్తింపును రద్దుచేసి, ఫీజుల నియంత్రణ చట్టం తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతపురం నారాయణ కళాశాల విద్యార్థి మరణానికి నైతిక బాధ్యత వహిస్తూ నారాయణ మంత్రి పదవికి రాజీనామా చేయాలన్నారు. ఫీజులతో సంబంధం లేకుండా ప్రతి విద్యార్థికి హాల్ టికెట్లు మంజూరు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ డివిజన్ అధ్యక్షుడు శ్రీకాంత్, డివిజన్ నాయకులు మెహన్, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు సంతృప్తి పొందేలా ఫిర్యాదులను పరిష్కరించాలి

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు: ప్రజలు సంతృప్తి పొందేలా ఫిర్యాదులను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా జిల్లా కలెక్టర్ ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఫిర్యాదుల స్వీకరణ అనంతరం జిల్లా కలెక్టర్ ఫిర్యాదుల పరిష్కారంపై అధికారులతో సమీక్షించారు. పీజీఆర్ఎస్ లాగిన్‌లో వచ్చిన అర్జీలను ఎప్పటి కప్పుడు చూడాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఎట్ టు వ్యూ ఆప్షన్ కింద మండల సర్వేయర్, హాలహర్వి వద్ద 58 రోజులుగా దరఖాస్తును ఇంత వరకు ఓపెన్ చేసి చూడలేదని సంబంధిత సర్వేయర్‌పై చర్యలు తీసుకోవాలని సర్వే ఏడీని కలెక్టర్ ఆదేశించారు. డిస్ట్రిక్ట్ రిజిస్ట్రార్‌కు సంబంధించిన దరఖాస్తు ఏడు రోజులుగా పెండింగ్‌లో ఉందని, కార్మిక శాఖ లాగిన్‌లో గత 15 రోజులుగా ఒక దరఖాస్తు ఇంతవరకు ఓపెన్ చేసి చూడలేదన్నారు. జాయింట్ కలెక్టర్ డా.బి.నవ్య, అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, ఇంఛార్జి డీఆర్ఓ బీకే వెంకటేశ్వర్లు, డిప్యూటీ కలెక్టర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థినిపై గుర్తు తెలియని వ్యక్తులు దాడి

- ఇంటర్ విద్యార్థినిపై గుర్తు తెలియని వ్యక్తులు దాడి
- అమ్మాయి మణికట్టు దగ్గర చేయిని కోసి, జుట్టును కత్తిరించిన దుండగులు

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్ : తాండ్రపాడులోని ఎస్సార్ జూనియర్ కాలేజీ హాస్టల్‌లో ఉంటూ ఓ విద్యార్థిని ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోంది. విద్యార్థిని రూమ్‌లో మరో నలుగురితో కలిసి ఉంటోంది. ఈ నెల 26 రాత్రి నిద్రించే సమయంలో గుర్తు తెలియని దుండగులు చేయి మణికట్టు దగ్గర కోసి, ఆమె జుట్టును కత్తిరించి, రెండు ముక్కలు చేసి, నిమ్మకాయలను ఆమె మీద వేసి వెళ్లారు. సదరు విషయాన్ని ఆ విద్యార్థిని కళాశాల ప్రిన్సిపాల్, వార్డెన్‌ల దృష్టికి తీసుకెళ్లింది. వారు ఎలాంటి విచారణ చేయకుండా, ఎలా జరిగిందో తెలుసుకోకుండా కేవలం రూ.500 రూపాయలు చేతిలోపెట్టి ఆసుపత్రికి వెళ్లి చూయించుకోమంటూ నిర్లక్ష్యంగా వ్యవహరించారు. హాస్టల్ పరిసరాల్లో విద్యార్థుల భద్రత కొరకు సీసీ కెమెరాలు, లేడీస్ సెక్యూరిటీ గార్డ్స్, ఎలాంటి ప్రాథమిక మెడికల్ కిట్లు గాని అందుబాటులో ఉంచకపోవడం గమనార్హం. సంఘటన జరిగిన విద్యార్థిని తల్లిదండ్రులకు తెలియడంతో తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాలు ఆందోళన వ్యక్తం చేశారు. రీజనల్ ఇంటర్మీడియట్ ఆఫీసర్ కళాశాలకు వచ్చి నామమాత్రపు విచారణ చేపట్టారు. ఇంత జరిగినా కూడా ఎలాంటి చర్యలు, ఆదేశాలు జారీ చేయకపోవడం విశేషం. ఈ సంఘటనపై పూర్తిస్థాయిలో దర్యాప్తు చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి. ఈ కార్యక్రమంలో విద్యార్థి నాయకులు బీసీ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్ బాబు, ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ స్టేట్ సెక్రెటరీ నాగరాజు, ఆర్పీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు నాగరాజు, వైఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సురేష్ యాదవ్, నాగార్జున, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ గుర్తింపు లేని ప్రైవేట్ హాస్పిటల్స్‌ను సీజ్ చేయాలి

విశాలాంధ్ర- కర్నూలు వైద్యశాల: కర్నూల్ నగరంలో ప్రభుత్వ అనుమతి లేకుండా ప్రభుత్వ నియమ నిబంధనలు పాటించకుండా ఇష్టారాజ్యంగా వ్యవ హరిస్తున్న ప్రైవేట్, కార్పొరేట్ హాస్పిటల్స్‌ను సీజ్ చేయాలని సోమవారం ఉదయం కర్నూలు సునయన ఆడిటోరియంలో జరిగిన ప్రజా దర్బార్‌లో అఖిల భారత యువజన సమాఖ్య ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్‌కి వినతి పత్రం సమర్పించారు. శ్రీనివాసులు, బీషన్నలు మాట్లాడుతూ కర్నూల్ నగరంలో రోజుకు ఒక ప్రైవేట్ హాస్పిటల్ పుట్టుకొస్తుందని అది కూడా ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా నడుపుతున్న హాస్పిటల్స్ ను అదుపు చేయడంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. కనీస మౌలిక సౌకర్యాలైన అత్యవసర ద్వారం (ఫైర్ ఎగ్జిట్), పేషెంట్లను తీసుకెళ్లడానికి ర్యాంపు, ఆక్సిజన్ పైపులైన్లు, కనీసం పార్కింగ్ స్థలం కూడా లేకుండా దాంతోపాటు అర్హత కలిగిన డాక్టర్లు పూర్తిస్థాయి పర్యవేక్షణ లేకుండా ఎలాంటి అర్హతలు లేని వ్యక్తులు వైద్య సేవలు చేస్తున్నారన్నారు. అమాయక ప్రజల నుండి వేలకు వేలు వసూలు చేస్తున్నారని కావున ఇలాంటి ప్రభుత్వం అనుమతి లేని హాస్పటలను సీజ్ చేసి వాటి యాజమాన్యాలపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని ప్రజల ఆరోగ్యాలను కాపాడాలని వారి డిమాండ్ చేశారు. నగర అధ్యక్ష కార్యదర్శులు నాగరాజు, బీసన్న, నగర నాయకులు చంటి, శివాజీలు తదితరులు పాల్గొన్నారు.



నంద్యాల జిల్లాలో చెలరేగిపోతున్న రియల్ ఎస్టేట్ వ్యాపారులు

- లేని సమస్యలు సృష్టించి భూములు సొంతం చేసుకొని కోట్లకు పడగలెత్తిన వైనం
- నంద్యాల నుంచి బెంగుళూరు వరకు కబ్జా సామ్రాజ్యం విస్తరణ

విశాలాంధ్ర - కర్నూలు : కాలనాగు కాటేస్తే.. ఆ రియలెస్టేట్ వ్యాపారి కన్ను పడితే అంతే. కోట్ల విలువైన భూములు ఎక్కడ ఉన్నాయో..? తెలుసుకొని అక్కడ వాలిపోవడం. వివాదం లేకున్నా వివాదం సృష్టించడం.. సొంతం చేసుకోవడం ఆయనకు వెన్నతో పెట్టిన విద్య. భూ యజమానులకు దారికి వస్తే సరి.. లేకుంటే ప్రామిసరి నోట్లు, చెక్కుల పై ఫోర్జరీ సంతకాలు పెట్టి.. కేసులు వేసి వేధించడం పరిపాటిగా మారింది. వైసీపీకి చెందిన ఓ మాజీ ఎమ్మెల్యే బినామినని చెప్పి నంద్యాల నుంచి బెంగుళూరు వరకు ఆయన చేసిన అన్యాయాలు, కబ్జాలు అన్నీ, ఇన్నీ కావు. బెంగుళూరులో రూ.వందల కోట్ల విలువచేసే భూమిని రూ.25 కోట్లకే కొట్టేయదానికి ప్రయత్నం చేసిన్న తరుణంలో బాధితుడు అనంతపురం జిల్లాకు చెందిన ఎమ్మెల్యే ను కలవడం, ఆయన మంత్రి ఫరూక్ దృష్టికి తీసుకు రావడంతో అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. ఈ సమస్య నుంచి బయటపడేందుకు అధికార పార్టీకి చెందిన కొంత మంది నేతలను మచ్చిక చేసుకొని బయటపడేందుకు తీవ్ర ప్రయ త్నాలు చేస్తునట్లు తెలుస్తుంది. కొత్త జిల్లా కావడంతో భూముల ధరలకు అమాంతం రెక్కలు వచ్చాయి. వేలు చేసే భూములు లక్షలకు, లక్షలు విలువ చేసే భూములు కోట్లు పలుకుతున్నాయి. దీంతో ఆ రియల్ కన్ను ఆ భూములపై పడింది. వివాదాలులేని స్థలా లను కూడా.. వివాదాలు సృష్టించి సొంతం చేసుకుంటున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు ఈ రియల్ నాగు ఎమ్మెల్యే బినామినని చెప్పి చేసిన అక్రమాలు అన్ని ఇన్ని కావు. వివాదా లలో ఉన్న భూములు గుర్తించి అక్కడ పాగా వెయ్యడం, అధికార బలంతో అందరిని లోపరుచు కొని భూములు కొట్టేసి కోట్లకు పడగలెత్తి నట్టు తెలుస్తోంది. భూములు కొనేటప్పుడు తనకు సంబ ఒదించిన వ్యక్తి చేత కొనించడం.. కొంత డబ్బులు ఇచ్చి అగ్రిమెంట్ చేయించడం.. తర్వాత భూ యజ మానికి చుక్కలు చూపించడం అక్రమాల్లో ఒక భాగంగా తెలుస్తోంది. భూమి కొనుగోలు చేసిన వ్యక్తిని అడ్డం పెట్టుకొని డబ్బులు కట్టకుండా వేరే వ్యక్తులు కొనకుండా చుక్కలు చూపించడం ఆయనకు వెన్నతో పెట్టిన విద్య. ఆ మాజీ ఎమ్మెల్యే పేరు అడ్డుపెట్టుకొని లెక్కలేనంత సంపాదించినట్లు నంద్యాల పట్టణంలో జోరుగా చర్చ సాగుతోంది. భూములు విషయంలోనే కాదు.. అప్పులు ఇచ్చి వేధించడంలోనూ ఆయనకు ఆయనే సాటి అని చెబుతున్నారు. అప్పులు ఇచ్చింది కొంత అయితే ఎక్కువ మొత్తం ఇచ్చినట్టు ఫోర్జరీ సంతకాలతో ప్రామిసరీ నోట్లు, చెక్కులు సృష్టించి కేసులు వేసి బాధితులకు చుక్కలు చూపించడం లో కూడా ఆరితేరినట్టు తెలుస్తోంది. గతంలో ఓ భూమికి సంభందించి భూ యజమానికి రూ.10 కోట్లు ఇచ్చినట్టు తెలుస్తోంది. అయితే ఆ యజమాని భూమి అమ్మకుండా ఆయన ఇచ్చిన డబ్బులకు వడ్డీ వేసి రూ.25 కోట్ల వరకు ముట్టజెప్పినట్టు తెలుస్తోంది. ఇలా ఈ రియల్ నాగు చేస్తున్న అక్రమాలు నంద్యాల నుంచి బెంగుళూరు వరకు విస్తరించాయి. బెంగుళూరు కు చెందిన ఓ భూ యజమాని కూడా విసిగిపోయి అనంతపురం జిల్లాకు చెందిన ఓ ఎమ్మెల్యేను ఆశ్రయించినట్టు తెలుస్తోంది. దీంతో ఆయన రాష్ట్ర న్యాయశాఖ మంత్రి ఫరూక్ దృష్టికి తీసుకురావడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. అక్రమాల నుంచి బయటపడేందుకు అధికార పార్టీ నేతలతో రాయబారాలు నడుపుతున్నట్లు తెలుస్తుంది. ఈవిషయం కర్నూలు నగరంలోని ఒక ఉన్నతాధికారి వద్ద పంచాయతీకి సిద్ధమైనట్లు తెలుస్తుంది.

పుట్టగోడుగుల ఫ్యాక్టరీలో భద్రత ఎక్కడ..

విశాలాంధ్ర - ఓర్వకల్లు : స్థానిక మండల కేంద్రంలో కాల్వ గ్రామ సమీపాన ఉన్న పుట్టగొడుగుల ఫ్యాక్టరీ నిత్యం ప్రమాదాలకు గురి అవుతున్నా కార్మికులకు ఎలాంటి రక్షణ భద్రత లేకుండా ఉన్న ఫ్యాక్టరీపై చర్యలు తీసుకోవాలని సీపీఐ మండల కార్యదర్శి రమేష్ కోరారు. ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మండల తహాశీల్దార్ ఆఫీస్ నందు ప్రజా దర్బార్‌లో తాహాశీల్దర్ విద్యాసాగర్‌కి వినతిపత్రం సమర్పించారు. అనంతరం సీపీఐ మండల కార్యదర్శి రమేష్, సహయకార్యదర్శి సుధాకర్, రాయలసీమ విద్యార్థి ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాయలసీమ రవీంద్రనాథ్. ప్రగతిశీల విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు అయ్యన్నలు మాట్లాడుతూ ఓరకల్లు మండలంలో మొట్టమొదటి పరిశ్రమ పుట్టగొడుగుల ఫ్యాక్టరీ పరిశ్రమ వచ్చిందని అని సంతోషించేలోపు ప్రతి నిత్యం కార్మికులను ప్రమాదాలకు గురి చేస్తున్నారన్నారు. పుట్ట గొడుగుల ఫ్యాక్టరీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని అన్నారు. ఫ్యాక్టరీలో పనిచేస్తున్న కార్మికులకు 8 గంటల పని అని చెప్పి పనిలో చేర్చుకొని, 13 నుండి 14 గంటల వరకు పని చేయాల్సిందేనంటూ హుకుం జారీ చేసి, పనులు చేయించుకుంటున్నారని తెలిపారు. పుట్టగొడుగుల ఫ్యాక్టరీలో పని చేస్తున్న కార్మికులకు నాణ్యమైన భోజనం అందించి, వైద్య పరీక్షలు నిర్వహించి, కార్మికునికి ఉద్యోగ కల్పించాలన్నారు. నాయకులు ఫీరోజ్, హుషేన్, రాము, వేంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

మరిన్ని వార్తలు E-PAPERలో

విశాలాంధ్ర కర్నూలు/నంద్యాల
www.visalaandra.com
కర్నూలు, మంగళవారం 28, జనవరి 2025

సీడీపీవో మద్దమ్మను సస్పెండ్ చేయాలి

విశాలాంధ్ర - ఆస్పరి: ఆస్పరి క్లస్టర్ పరిధిలో అంగన్వాడీ ఉద్యోగులపై వేధింపులకు పాల్పడుతున్న ఐసిడిఎస్ సీడీపీవో మద్దమ్మను తక్షణమే సస్పెండ్ చేయాలని ఏఐటీయూసీ మండల కార్యదర్శి కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆలూరు నియోజకవర్గం పరిధిలో సిడిపిఓగా పనిచేస్తున్న మద్దమ్మ మామూలు మత్తులో మునిగి తేలుతుందని, పర్సంటేజీలు ఇచ్చిన వారిని ఒకరకంగా పర్సంటేజీలు ఇవ్వని ఉద్యోగులను మరోరకంగా చూస్తూ తన క్లస్టర్ పరిధిలో ఒక సెక్టార్‌కు అనుకూలంగా మరో సెక్టార్ కు వ్యతిరేకంగా అంగన్వాడీ ఉద్యోగులను వేధింపులకు గురి చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. కూరగాయలు, అద్దె బిల్లుల్లో పర్సంటేజ్ ఇవ్వకపోతే వాళ్లని విజిట్ చేసి వేధిస్తుందన్నారు. అంగన్వాడీలపై కక్షపూరితమైన ధోరణిలో కొంతమంది ఉద్యోగులను టార్గెట్‌గా చేసి జీతాలు కట్ చేస్తూ వారి కడుపులు కొడుతుందన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అవినీతి అక్రమాలు వేధింపులకు పాల్పడుతున్న సీడీపీఓపై ఐసీడీఎస్ జిల్లా అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో సిపిఐ సీనియర్ నాయకులు బ్రహ్మయ్య, ఏఐటీయూసీ నాయకులు శేఖరు, సురేషు, రంగన్న తదితరులు పాల్గొన్నారు.

నారాయణ, శ్రీ చైతన్య విద్యాసంస్థలకు తొత్తుగా మారిన కూటమి ప్రభుత్వం

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్ : నారాయణ, శ్రీ చైతన్య విద్యాసంస్థలకు తొత్తుగా మారిన కూటమి ప్రభుత్వం అని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు సోమన్న, పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.భాస్కర్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అబ్దుల్లా, ఏఐఎస్ఏ రాష్ట్ర కార్యదర్శి నాగరాజు, ఏఐడిఎస్ఓ రాష్ట్ర అధ్యక్షులు హరీష్ కుమార్, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి బి.మహేంద్ర బాబు అన్నారు. సోమవారం స్థానిక కర్నూల్ నగరం గౌరీ గోపాల్ నుండి కలెక్టరెట్ వరకు ర్యాలీ నిర్వహించి గాంధీ విగ్రహం ముందు ధర్నా చేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో నారాయణ, శ్రీ చైతన్య కళాశాలలు విద్యార్థులపై ఫీజులు చెల్లించాలని తీవ్రమైన వేధింపులు గురిచేస్తూ, ర్యాంకుల కోసం విద్యార్థుల మధ్య తారతమ్యాలు సృష్టిస్తూ విద్యార్థుల మరణాలకు కారణమైన కార్పొరేట్ విద్యా సంస్థల యజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేస్తున్నాం. రాష్ట్రంలో పరీక్షలు దగ్గర వస్తున్న నేపథ్యంలో కార్పొరేట్ నారాయణ, చైతన్య, కళాశాలలో ఫీజులు చెల్లించాలని వేధింపులు గురిచేయడం వలన విజయవాడలో చైతన్య గోశాల క్యాంపస్, గోసలైట్,అనంతపురం నారాయణ కళాశాలలో ఫీజు చెల్లించలేదని గంటల తరబడి విద్యార్థిని తరగతి గది ముందు నిలబెట్టడంతో విద్యార్థి మనస్తాపానికి గురై అక్కడికక్కడే మూడో అంతస్తు నుండి దూకి ఆత్మహత్య చేసుకున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షులు అఖండ, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రంగప్ప, ఏఐఎస్ఏ జిల్లా అధ్యక్షులు నాగార్జున, ఏఐఎస్ఎఫ్ నగర అధ్యక్షులు అఖి, సహాయ కార్యదర్శి కుమార్, ఎస్ఎఫ్ఐ నగర కార్యదర్శి సాయి, ఎస్ఎఫ్ఐ జిల్లా పిఎస్ఎన్ కన్వీనర్ అమర్, ఎస్ఎఫ్ఐ నగర నాయకులు అబ్బు, నాయకులు మనోహర్, చింటూ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ అంతర్జాల సదస్సులో ప్రతిభ చాటిన క్లస్టర్ విద్యార్థులు

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్ : కేఆర్‌కే ప్రభుత్వ కళాశాల ఆద్దంకి నిర్వహించిన గణితమృతం జాతీయ అంతర్జాల సదస్సులో క్లస్టర్ యూనివర్సిటీ సిల్వర్ జూబ్లీ డిగ్రీ కళాశాల విద్యార్థులు డి.నిఖిల్ సెకండ్ బీకాం, ఇ.లక్ష్మీనరసింహ సెకండ్ బీఏ సంయుక్తంగా సమర్పించిన అప్లికేషన్స్ ఆఫ్ బయో స్టాటస్టిక్స్ అనే పరిశోద నపత్రంలో ప్రథమ స్థానంలో ఎంపికై ఉత్తమ పరిశోధనగా పత్రంగా రూ.20 వేల నగదు బహుమతిని గెలుచుకోవడం జరిగింది. ఈ సందర్భంగా క్లస్టర్ యూనివర్సిటీ ఉపకులపతి ఆచార్య డివిఆర్ సాయి గోపాల్, రిజిస్ట్రార్ డాక్టర్ కట్టా వెంకటేశ్వర్లు, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వివిఎస్ కుమార్, వైస్ ప్రిన్సిపల్ బిఆర్ ప్రసాద్ రెడ్డి, క్లస్టర్ యూనివర్సిటీ డీన్ అడ్మినిస్ట్రేషన్ ఇంచార్జ్ డాక్టర్ అక్తర్ బాను విజేతలను అభినందించారు. పరిశోధన వైజ్ఞానిక ఆవిష్కరణలో క్లస్టర్ యూనివర్సిటీ విద్యార్థులు ముందుండాలని వీసీ ఆచార్య డివిఆర్ సాయి గోపాల్ సూచించారు.

గిట్టుబాటు ధర అందేలా చూస్తాం

విశాలాంధ్ర - ఓర్వకల్లు : పొగాకు రైతులకు గిట్టు బాటు ధర అందేలా ఐటీసీ కంపెనీ వారితో చర్చిస్తామని జిల్లా వ్యవసాయ సంయుక్త సంచాలకులు వరలక్ష్మి హామీ ఇచ్చారు. ఓర్వకల్లులోని పొగాకు కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి, కొనుగోలు ప్రక్రియను పరిశీలించి, ఐటసీ కొనుగోలుదారు, రైతులతో మాట్లాడారు. గ్రేడింగ్, నాన్ గ్రేడెడ్ ప్రొడక్ట్స్, నాణ్యత ప్రకారం ధర నిర్ణయించడం, బేల్స్‌లో భౌతిక నాణ్యత వ్యత్యాసాన్ని చూపించడం గురించి ఆమెకు వివరించబడింది. జేడీఏ రైతులను ఉద్దేశించి, కంపెనీల ప్రయత్నాలను ఆమె మెచ్చుకున్నారు. మెరుగైన ధర కోసం గ్రేడింగ్ చేయాలని రైతులకు తెలియజేశారు. కంపెనీ ఇచ్చిన హామీ మేరకు రైతులను అన్ని విధాలుగుగా కంపెనీ సహయ పడుతునట్లు తెలిపారు.

మండల అధికారులకు సన్మానం

విశాలాంధ్ర కౌతాళం:- మండలంలోని ప్రజలకు అందించిన మండల అధికారులు తాసిల్దార్ రజనీకాంత్ రెడ్డి, ఎంపీడీవో సుబ్బరాజు లకు 76వ గణతంత్ర దినోత్సవం పురస్కరించుకొని ఆదివారం వారికి జిల్లా కలెక్టర్ రంజిత్ భాష చేతులమీదుగా ప్రశంసా పత్రాలు అందజేశారు. వీరికి సోమవారం తెలుగుదేశం పార్టీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి, క్లస్టర్ త్రీ ఇంచార్జ్, వెంకటపతి రాజు, ఆర్.ఎం.పి డాక్టర్స్ సంఘం అధ్యక్షులు, రాజా ఆనంద్ మర్యాదపూర్వకంగా కలిసి పూలమాల శాలువులతో సత్కరించారు. ఈ సందర్భంగా వెంకటపతి రాజు మాట్లాడుతూ కష్టపడి పని చేసే ప్రతి అధికారికి సమాజంలోనూ, అధికారికంగానూ గొప్ప స్థానం ఉంటుందని మంచి సేవలు అందించిన అధికారులు ప్రజల గుండెల్లో ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో పల్లం రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించండి

విశాలాంధ్ర - హొళగుంద: మండల తహశీల్దార్‌గా గడి నిజాముద్దీన్ బదిలీపై రావడంతో సోమవారం సీనియర్ టీడీపీ నాయకులు డీఎస్ బాష, అబ్దుల్ సుభాన్, మోయిన్, వలి, జావీద్, డీఎస్ నూర్, మంగయ్యలు శాలువా వేసి పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో సత్వరమే సమస్యలను పరిష్కరించాలని కోరారు. అర్హులైన వారికి ఇంటి పట్టాలు, పొలం పాస్ బుక్కులు అందించాలని ఎల్లవేళల ప్రజలకు రెవెన్యూ అధికారులు అందుబాటులో ఉండాలని విజ్ఞప్తి చేశారు.

పంట పొలాలకు సాగునీరు అందించాలి

విశాలాంధ్ర- పత్తికొండ: హంద్రీనీవా ప్రధాన కాలువ కింద ఉన్న కుడి, ఎడమ కాలువ పనులను పూర్తిచేసి పంట పొలాలకు సాగునీరు అందించాలని డీసీసీ జిల్లా అధ్యక్షులు మురళీకృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి బృందం కొత్తపల్లి రిజర్వాయర్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హంద్రీనీవా రిజర్వాయర్ కింద ఉన్న కుడి, ఎడమ కాలువ పనులను పూర్తి చేసినట్లయితే జిల్లాలో 61 వేల నాలుగు వందల ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. కూటమి ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులకు తగిన నిధులు కేటాయించి, యుద్ధ ప్రాతిపదికన పనులను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ ఆదోని, ఎమ్మిగనూరు, ఆలూరు, నియోజకవర్గ ఇన్చార్జీలు రమేష్ యాదవ్, ఖాసింవలి, లక్ష్మీనారాయణ, నాయకులు హర్షవర్ధన్, మహమ్మద్, సుల్తాన్, సాంబ, హుస్సేన్ పాల్గొన్నారు.

రైతు సేవ కేంద్రం పరిశీలన

విశాలాంధ్ర - కోడుమూరు : మండలంలోని వర్కూరు గ్రామంలో ఉన్న రైతుసేవా కేంద్రాన్ని మండల వ్యవసాయ అధికారి ఎన్ రవిప్రకాష్ పరిశీలించారు.సోమవారం వర్కురు గ్రామంలోని రైతు సేవ కేంద్రం తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన సిబ్బందితో మాట్లాడుతూ రైతుల నుంచి కందుల రిజిస్ట్రేషన్ చేయవలసిందిగా ఆదేశించారు.కంది పంట వేసుకున్న ప్రతిరైతు పంటను ప్రభుత్వం మద్దతు ధరతో కొనుగోలు చేస్తారన్న సమాచారం రైతులకు తెలియజేయాలని సూచించారు. గ్రామాల్లో రైతులకి గన్నిబ్యాగులు సప్లై చేయనున్నట్లు తెలిపారు. మార్కెట్ రేటు తక్కువగా ఉన్నందున ప్రభుత్వం ఇస్తున్న మద్దతు ధర ద్వారా క్వింటాలకు రూ.7550లు కొనుగోలు ధరలను రైతులు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు.

జూనియర్ లెక్చరర్లకు పదోన్నతులు కల్పించాలి

విశాలాంధ్ర - ఎమ్మిగనూరు: జీవో నెంబర్ 223 రద్దుచేసి రాష్ట్రంలో అర్హులైన స్కూల్ అసిస్టెంట్లకు జూనియర్ లెక్చరర్స్‌గా పదోన్నతులు కల్పించాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి టీకే జనార్ధన, రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అడివన్న అధ్యక్షతన ఎమ్మిగనూరు ఎస్‌టియు ప్రాంతీయ కార్యాలయం నందు ఏర్పాటు చేసిన తాలూకా స్థాయి ముఖ్య నాయకుల సమావేశంకు హాజరైన జిల్లా ప్రధాన కార్యదర్శి టి.కే. జనార్ధన మాట్లాడుతూ రాష్ట్రంలోని అర్హులైన స్కూల్ అసిస్టెంట్లులి లిజూనియర్ లెక్చరర్ పదోన్నతుల కోసం ఎదురుచూస్తున్నారని గత 22 సంవత్సరాల నుండి జూనియర్ లెక్చరర్ ప్రమోషన్స్ పొందలేదని 2002వ సంవత్సరం నందు జూనియర్ లెక్చరర్స్ ప్రమోషన్ చివరిసారిగా ఇవ్వడం జరిగిందనిలి లికావున వెంటనే జూనియర్ లెక్చరర్స్ ప్రమోషన్స్ రాష్ట్రంలో కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పూర్వపు కార్యదర్శులు బసవరాజు, ప్రసన్నరాజు, రాష్ట్ర కన్వీనర్లు బాబయ్య, యల్లప్ప, చంద్రశేఖర్, ఎర్రి స్వామి, ఈరన్న జిల్లా కార్యదర్శులు నాగరాజు మరియు రామచంద్ర, నాయకులు సురేష్,శేఖర్, బుట్టా శంకర్,శీలప్ప, రాఘవేంద్ర, చిన్నతిమ్మన్న పాల్గొన్నారు

పరిష్కార పురోగతిని అర్జీదారుడుకి తెలపాలి

విశాలాంధ్ర - కర్నూలు సీటీ : ప్రతి సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఫిర్యాదులు పునరావృతం కాకుండా, సమస్యల పరిష్కార దశను ఎప్పటికప్పుడు అర్జీదారుడికి తెలియజేయాలని నగరపాలక కమిషనర్ ఎస్.రవీంద్ర బాబు అధికారులను ఆదేశించారు. సోమవారం నగరపాలక కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి 13 అర్జీలు వచ్చాయి. అర్జీదారుల సమస్యలు ఒక్కొక్కటిగా తెలుసుకుంటూ, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మేనేజర్ ఎన్.చిన్నరాముడు, ప్రజారోగ్య అధికారి డాక్టర్ కె.విశ్వేశ్వర్ రెడ్డి, ఎస్ఈ రాజశేఖర్, సిటి ప్లానర్ ప్రదీప్ కుమార్, ఆర్ఓ జునైద్, ఎంఈ సత్యనారాయణ, టిపిఆర్ఓ వెంకటలక్ష్మి, టిడ్కో అధికారి పెంచలయ్య, తదితరులు పాల్గొన్నారు.

30న మండల సర్వసభ్య సమావేశం

విశాలాంధ్ర - కొలిమిగుండ్ల: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ సమావేశం భవనం నందు ఈనెల 30వ తేదీన మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ప్రసాద్ రెడ్డి సోమవారం తెలిపారు. ఎంపీపీ నాగవేణి అధ్యక్షతన మండల సమావేశం జరుగుతుందని తెలిపారు. ఆయా గ్రామ సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పిటిసి, ఆయా శాఖ మండల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు తప్పకుండా హాజరు కావాలన్నారు. ఆయా మండల శాఖ అధికారులు శాఖకు సంబంధించి తాజా ప్రగతి నివేదికలను సమావేశానికి మూడు రోజులు ముందు ఎంపీడీవో కార్యాలయంలో అందజేయాలని కోరారు.

ఎంఈవోను సన్మానించిన ఉపాధ్యాయ బృందం

విశాలాంధ్ర - రుద్రవరం: మండల నూతన ఎంఈవోగా నియమితులైన వీర రాఘవయ్యను సోమవారం రుద్రవరం మండల ఫిజికల్ డైరెక్టర్లు మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. ఈ సందర్భంగా ఆయనను శాలువా పూలమాలతో సన్మానించారు. కార్యక్రమంలో జడ్.పి.హెచ్. ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుబ్బరాయుడు, రుద్రవరం ఆదర్శ పాఠశాల పిడి శ్రీనివాసులు, పిడి షేక్షావలి, పిడి సత్యబాబు, పీడి రేణుక, పిఈటి కళావతి మరియు పిఈటి సుబ్బయ్య పాల్గొన్నారు.

రెండు మద్యం దుకాణాలకు ప్రభుత్వం అనుమతి

విశాలాంధ్ర-డోన్: డోన్ మున్సిపాలిటీ పరిధిలో ఒకటి, గ్రామీణ ప్రాంతాల్లో ఒక మద్యం దుకాణం అమ్ముకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. మద్యం పాలిసిలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా ఈడిగ కులస్థులకు మద్యం దుకాణాలు ఇస్తామని సీఎం హామీలో భాగంగా డోన్‌కు రెండు ఏర్పాటాయ్యయ్యని డోన్ ఎక్సైజ్ సీఐ వరలక్ష్మి తెలిపారు. ఆసక్తి ఉన్న ఈడిగ కులస్థులు 2లక్షలు నగదు, ఆన్లైన్ కానీ ఫిబ్రవరి 5 తేదీ లోపు చెల్లించాలని తెలిపారు.

పశు ఆరోగ్య శిబిరాలతో ఉత్పాదకత

విశాలాంధ్ర - చాగలమర్రి : పశువుల ఉత్పాదకత పెంచే లక్ష్యంగా పశు ఆరోగ్య శిబిరాలను నిర్వహిస్తున్నట్లు ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకులు వరప్రసాద్ తెలిపారు.సోమవారం మండలంలోని నగళ్ళపాడు గ్రామంలో పశు ఆరోగ్య శిబిరాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పశు వైద్యాధికారి దీపాకుమారి ఈ శిబిరంలో దూడలకు, గేదెలు, గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు తాగించారు. చూడి పశువులకు, ఎదకురాని, తిరగకట్టు పశువులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు. ఆరోగ్యం బాగాలేని పశువులకు చికిత్స చేసి మందులను ఉచితంగా అందజేశారు. టీడీపీ నాయకులు దస్తగిరి, వీఎల్ఓ మురళి కృష్ణ,ఏహెచ్ఏలు పాల్గొన్నారు.

యువగళం రెండేళ్ళు పూర్తి కావడంతో సంబరాలు

విశాలాంధ్ర - ఆత్మకూరు టౌన్ : ఎన్డీఏ కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమవుతుందని టిడిపి నాయకులు శివరాం రెడ్డి, శివ ప్రసాద్ రెడ్డి, అబ్దుల్లాపురం భాష లు పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర ప్రారంభమై నేటితో రెండేళ్ళు పూర్తి అయిన సందర్భంగా శ్రీశైలం నియోజకవర్గం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి ఆదేశాల మేరకు పట్టణంలోని గౌడ్ సెంటర్ నందు కేక్ కట్ చేసి సంబరాలు ఎన్డీయే కూటమి నాయకులు శ్రీరాములు, హబీబుల్లా నిర్వహించారు.

మైనర్, ర్యాష్ డ్రైవింగ్, రోడ్డు ప్రమాదాలపై చర్యలు తీసుకోండి

విశాలాంధ్ర - ఆదోని: పట్టణంలో రోజురోజుకు పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలపై అధికారులు ప్రత్యేక చొరవ చూపాల్సిన అవసరం ఉందని రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షుడు, న్యాయవాది జీవన్ సింగ్ అన్నారు. సోమవారం ఆదోని రోటరీ క్లబ్ అధ్యక్షుడు సందీప్ రెడ్డి ఆధ్వర్యంలో సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, డీఎస్పీ హేమలతకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షుడు, న్యాయవాది జీవన్ సింగ్ మాట్లాడుతూ పట్టణంలో మైనర్, ర్యాష్ డ్రైవింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్, సౌండ్ పొల్యూషన్ డ్రైవింగ్ లతో నిత్య ప్రమాదాలు, పట్టణంలోని దాదాపు అన్ని వార్డుల్లో, ప్రాంతాల్లో జరుగుతున్నాయని రెవెన్యూ, పోలీసు ఉన్నతాధికారులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించి ప్రమాదాల బారి నుండి కాపాడాలని అన్నారు. మైనర్ కారు డ్రైవింగ్ వల్ల గత నాలుగు నెలల క్రితం బైపాస్ రోడ్డులో ఒకరు, గత మూడు నెలల క్రితం పట్టణంలో టూ వీలర్ ర్యాష్ డ్రైవింగ్ వల్ల మరొకరు ప్రమాదాల బారినపడి చనిపోవడం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. రోటరీ క్లబ్ సభ్యులు సనత్ అయ్య, సునీల్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి, రాంప్రసాద్, భరత్ ష, ప్రశాంత్ గాంధీ, సోమశేఖర్ రెడ్డి, రాచోటి సుబ్బయ్య, విట్ట రాజేష్, సాబీర్ బాష, వికాస్ జైన్ పాల్గొన్నారు.

గుండ్రేవుల ప్రాజెక్టు నిర్మాణమే జీవిత ఆశయం

విశాలాంధ్ర - కోడుమూరు : రాయలసీమలోని కర్నూలు జిల్లా పశ్చిమ ప్రాంత రైతుల సంక్షేమమే ధ్యేయంగా గుండ్రేవుల ప్రాజెక్టు నిర్మాణం పూర్తిచేయడం నా జీవిత ఆశయమని డోన్ ఎమ్మెల్యే కోట్ల జయ సూర్యప్రకాశ్ రెడ్డి అన్నారు. సోమవారం ఆయన కోడుమూరు పట్టణంలోని స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయంలో స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలతో కాసేపు మాట్లాడారు. అనంతరం కోడుమూరు మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ బి.భాగ్యరత్న కలిసి విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలోని రైతాంగం సంక్షేమం కోసం గుండ్రేవుల, వేదవతి, ఆర్డీఎస్ ప్రాజెక్టుల నిర్మాణానికి అహర్నిశలు కృషి చేస్తానన్నారు. 4500 కోట్ల నిధులతో గుండ్రేవుల ప్రాజెక్ట్ నిర్మాణానికి తెలంగాణ ప్రభుత్వ అనుమతులకు కూటమి ప్రభుత్వం నివేదికలు పంపినట్లు చెప్పారు. ప్రాజెక్టు నిర్మాణానికి ఈ ఏడాది పనులు మొదలుపెట్టే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. కోడుమూరు-లద్దగిరి రోడ్డు నిర్మాణానికి ఫిబ్రవరి 1నుంచి పనులు మొదలు అవుతున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కెఈ రాంబాబు,మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి, ఎమ్మార్పీఎస్ నాయకులు ఆంధ్రయ్య, టీడీపీ నాయకులు వేణుగోపాల్ రెడ్డి, టెలిఫోన్ రాముడు,గోరంట్ల తిరుమల నాయుడు, నాగభూషణం రెడ్డి, కిషోర్ గౌడ్, గిడ్డయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

జీవనోపాదులను మెరుగుపరుచుకోవాలి

విశాలాంధ్ర-పాణ్యం : పొదుపు మహిళలు రుణాలు తీసుకొని జీవనోపాదులను మెరుగు పరుచుకొని, ఆర్థికంగా స్వయం సమృద్ధి సాధించాలని ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ అన్నారు. ఈ సందర్భంగా జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా నైపుణ్య అభివృద్ధి సంస్థ సహకారంతో సోమవారం స్థానిక మండల మహిళా సమాఖ్య నందు నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమాన్ని ఏపీఎం ప్రసాద్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయడం జరిగినది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ హాజరై మాట్లాడుతూ స్వయం సహాయక సంఘం మహిళలు ఏర్పాటు చేసుకున్న జీవనోపాదులను ఏవిధంగా అభివృద్ధి చేసుకోవాలి వారు తయారు చేసినటువంటి ఆ యొక్క ఉత్పత్తులను ఎలా ప్యాకింగ్ చేసుకోవాలి మార్కెటింగ్ సదుపాయం ఏ విధంగా కల్పించుకోవాలి అనేటువంటి వాటి మీద బాగా అవగాహన చేసుకుని మీరు చేస్తున్నటువంటి అభివృద్ధి కార్యక్రమం ద్వారా మరింత ఆదాయం పెంపొందించుకోవాలన్నారు. ఏపీఎం ప్రసాద్ మాట్లాడుతూ బ్యాంకు ద్వారా రుణాలు తీసుకున్నటువంటి ప్రతి మహిళ ఏదో ఒక జీవనోపాధి కార్యక్రమాన్ని ఏర్పాటు చేసుకొని తద్వారా తమ కుటుంబాన్ని ఆర్థికంగా అభివృద్ధి చేసుకోవాలన్నారు.జిల్లా డిపిఎం బాబురావు మాట్లాడుతూ ఈశిక్షణ మహిళలకు చాలా ఉపయోగకరంగా ఉంటుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జీవనోపాదుల శిక్షణ కార్యక్రమానికి శిక్షకులుగా శ్రీనివాస రావు,అల్లా బకాష్, అధ్యక్షురాలు కామాక్షమ్మ,వెలుగు సీసీలు, వీవోఏలు, 42 మంది మహిళల లబ్ధిదారులు హాజరు కావడం జరిగినది.

కృష్ణానది బోర్డు కర్నూలులో ఏర్పాటు చేయాలి : రాయలసీమ సాగినీటి సాధన సమితి

విశాలాంధ్ర - కోడుమూరు : కృష్ణానది యాజమాన్య బోర్డును రాయలసీమ ముఖద్వారం అయిన కర్నూలులో ఏర్పాటు చేయాలని రాయలసీమ సాగునీటి సాధన సమితి సభ్యులు చంద్రశేఖరరెడ్డి, రామకృష్ణా రెడ్డి తదితరులు డిమాండ్ చేశారు.ఈ మేరకు వారు సోమవారం కోడుమూరు మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ బి భాగ్యరత్నతో కలిసి పట్టణంలోని స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో మండల తహసిల్దార్ వెంకటేష్ నాయక్ కు వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన చట్టం 2014 ప్రకారం రెండు తెలుగు రాష్ట్రాల్లో కృష్ణానది నీటి నిర్వహణ,కృష్ణా జలాల వినియోగంపై వివాదాల పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వం కృష్ణానది యాజమాన్యం బోర్డు ఏర్పాటు చేసిందని, ఈ బోర్డు కేంద్ర ప్రధాన కార్యాలయం ఆంధ్రప్రదేశ్ లోనే ఏర్పాటు చేయాలని విభజన చట్టంలో పొందుపరిచారని గుర్తు చేశారు. ఏపీ విభజన చట్టం 2014 మేరకు కృష్ణా నది నీటి వీనియోగాలకు అనుమతులు పొందిన తెలుగుగంగా,గాలేరు,నగరి, వెలిగొండ సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణ శ్రీశైలం రిజర్వాయర్ పై ఆధారపడి ఉందని చెప్పారు. రాయలసీమ సాగునీటి ప్రాజెక్టులే కాకుండా ఆంధ్రప్రదేశ్లోని ప్రకాశం, నెల్లూరు,తెలంగాణలోని మహబూబ్ నగర్ జిల్లాలకు శ్రీశైలం రిజర్వాయర్ అత్యంత కీలకము కావడం వల్ల యాజమాన్యం బోర్డు కర్నూల్ లోనే ఏర్పాటు చేసేందుకు అనుకూలంగా ఉంటుందని పేర్కొన్నారు. మాజీ సర్పంచ్ కెఈ రాంబాబు,మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు కే మధుసూదనరెడ్డి, ఎమ్మార్పీఎస్ నాయకులు ఆంధ్రయ్య తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర రాజకీయ చిత్రపటాన్ని మార్చేసిన యువనేత లోకేష్ : బైరెడ్డి శబరి

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : అయిదేళ్ల వైసీపీ అరాచక పాలనపై సమరశంఖం పూరించి, రాష్ట్ర రాజకీయాలను మలుపు తిప్పిన చారిత్రాత్మక యువగళం పాదయాత్ర ప్రారంభమై రెండేళ్లు పూర్తయిందని, రాష్ట్రంలో 5 కోట్లమంది ఆశలు, ఆశయాలను ప్రతిబింబిస్తూ కుప్పం వరదరాజస్వామి పాదాల చెంత నుంచి 2023 జనవరి 27వతేదీన పాదయాత్రగా ప్రజల్లోకి వెళ్లిన యువనేత నారా లోకేష్ యువగళంతో రాష్ట్ర రాజకీయ చిత్రపటాన్నే మార్చేశారని, ఉద్యోగాల్లేక నిరాశ, నిస్పృహలతో కొట్టుమిట్టాడుతున్న యువత ఒకవైపు, ఇంటినుంచి బయటకు వెళ్తే తిరిగి క్షేమంగా తిరిగివస్తామనే గ్యారంటీ లేక భయాందోళనలతో మహిళలు మరోవైపు, అడ్డగోలు బాదుడుతో బతుకుభారంగా మారిన సామాన్య జనం, ఇంకోవైపు, ఇలా అడుగడుగునా అభద్రతాభావం, నిరాశ, నిస్పృహలతో కొట్టుమిట్టాడుతున్న ప్రజలకు నేనున్నానంటూ యువనేత నారా లోకేష్ ఆనాడు జనంలోకి వెళ్లారని నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి తెలిపారు.

హామీల అమలుదిశగా ప్రజాప్రభుత్వం అడుగులు : సుదీర్ఘ యువగళం పాదయాత్రలో యువత, మహిళలు, వృద్ధులు, విద్యార్థులు, ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనారిటీల ఆకాంక్షలకు అనుగుణంగా యువనేత నారా లోకేష్ అనేక హామీలను ఇచ్చారని, ముఖ్యంగా సీమ ప్రజల కోసం కడపలో మిషన్ రాయలసీమ పేరుతో డిక్లరేషన్ ను ప్రకటించారన్నారు. యువనేత లోకేష్ పాదయాత్రలో ఇచ్చిన హామీలను ప్రతిబింబిస్తూ ఎన్‌డీఏ కూటమి సూపర్ సిక్స్ పేరుతో మ్యానిఫెస్టో ప్రకటించిందని, పాదయాత్రలో యువనేత నారా లోకేష్ ఇచ్చిన హామీలను నెరవేర్చే దిశగా ప్రజాప్రభుత్వం అడుగులు వేస్తోందన్నారు. నారా లోకేష్ నేటితరం రాజకీయ నాయకులకు స్ఫూర్తిగా నిలుస్తున్నారని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి ప్రశంశించారు.

చట్ట సభల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలి

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : చట్ట సభల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై. నాగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. నంద్యాలలోని బీసీ భవన్ నందు బీసీ కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో జాతీయ బిసి సంక్షేమ సంఘం జాతీయ కార్యదర్శి నక్కల మిట్ట శ్రీనివాసులు, రాష్ట్ర నాయకులు విజయగౌరీ, బాలచంద్రుడు, కుమ్మరి ప్రసాద్, నాగేంద్రయాదవ్, వేంపేట రాంబాబు, వి వెంకటేశ్వర్లు, గోవింద నాయుడు, శివప్రసాద్, కృష్ణాజి రావు, రఘురాం యాదవ్ రాజు, గుర్రప్ప, వెంకటేశ్వర్లు గౌడ్, నందికొట్కూరు నియోజకవర్గ అధ్యక్షుడు, యాదవ్, రమణయ్య, రాజేంద్ర కల్లూరు కుమార్, వెంకట్రాముడు, శివ, నాగన్న, నాగరాజు, రామకృష్ణ, గురుసాహెబ్ పాల్గొన్నారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం కార్యవర్గ విస్తరణలో భాగంగా నంద్యాల పార్లమెంటు ఇన్చార్జిగా నాగేంద్రను, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పృధ్వీరాజును, యువజన కార్యదర్శిగా మధును నియమించారు. ఈ సందర్భంగా వై. నాగేశ్వరరావు యాదవ్ మాట్లాడుతూ చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్ కల్పించే విధంగా, కేంద్ర ప్రభుత్వ స్థాయిలో మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేసి, బీసీలు అన్ని కులాల్లో జనాభా నిష్పత్తి ప్రకారం సామాజికంగా, ఆర్థికంగా, విద్యాపరంగా, రాజకీయ పరంగా ఎదగడానికి తగిన ప్రాధాన్యత ఇవ్వవలసిందిగా గ్రామస్థాయి నుండి రాష్ట్రస్థాయి వరకు ఉద్యమాన్ని నెలకొల్పడం జరిగిందన్నారు. ఉద్యమ ఫలితంగానే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బీసీలకు రక్షణ చట్టం తెస్తానని చెప్పడం జరిగిందని, బీసీలలో అన్ని కులాలకు ప్రాధాన్యత కల్పిస్తామని చెప్పడం, 37 వేల కోట్లు బీసీలకు జనాభా నిష్పత్తి ప్రకారం బడ్జెట్లు ఇస్తానని చెప్పడం జరిగిందన్నారు. అన్ని జిల్లాల్లో బీసీ భవన నిర్మాణం చేపడతామని హామీ ఇవ్వడం జరిగిందన్నారు.

సీఎం చంద్రబాబు పాలనలో పరిశ్రమలకు పెద్దపీట

విశాలాంధ్ర - డోన్ : సీఎం చంద్రబాబు పాలనలో పరిశ్రమల స్థాపనకు ఆంధ్రప్రదేశ్ స్వర్గదామిగా మారిందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సీడ్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి అన్నారు. సోమవారం డోన్‌లో ఆయన తన కార్యాలయంలో మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు చంద్రబాబు నాయుడు దావోస్ పర్యటన విజయవంతం అయ్యిందన్నారు. వరల్డ్ ఎకనామిక్ ఫోరం సదస్సులో ప్రత్యేక ఆకర్షణగా ఆంధ్రప్రదేశ్ నిలిచిందని సంతోషం వ్యక్తం చేశారు. చంద్రబాబు నాయుడు నాడు తెలుగు ప్రజలకు మొదటిసారి ఐటీని పరిచయం చేసి, తెలుగువాడి కీర్తిని ప్రపంచానికి చాటి చెప్పారని కొనియాదారు. నేడు మరో ఇన్నోవేషన్ కు చంద్రబాబు శ్రీకారం చుట్టారని. ఏఐ రంగాన్ని ప్రోత్సహించేందుకు ప్రపంచ దిగ్గజాలతో భేటీ అయ్యారన్నారు. ప్రపంచంలోనే అత్యంత తలసరి ఆదాయం గల దేశాల్లో మన దేశాన్ని అగ్రగామిగా నిలిపారని, పిలుపునివ్వడంతో పాటు తెలుగువాడి ప్రతిభను మరోసారి పరిచయం చేసేందుకు కంకణం కట్టుకున్నారని అన్నారు. 20 లక్షల ఉద్యోగాలు కల్పించాలని లక్ష్యంగా ఎముకులను కొరికే చలిని (-6డి) సైతం లెక్కచేయకుండా రాష్ట్రంలో పారిశ్రామిక విప్లవం తీసుకురావడానికి దావోస్ నడి వీధుల్లో సీఎం చంద్రబాబు, ఐటీ మంత్రి నారా లోకేష్ పడిన శ్రమ సత్ఫలితాలనిస్తున్నాయని అన్నారు. రాష్ట్రంలో ఉన్న అపార వనరులు మౌలిక సదుపాయాలు అత్యుత్తమ పాలసీల గురించి పారిశ్రామికవేత్తలకు వివరించి పెట్టుబడులు పెట్టేందుకు ఆంధ్రప్రదేశ్ అణువైన రాష్ట్రమని ఆహ్వానించారు. 2019లో వైసీపీ వచ్చాక బ్రాండ్ ఏపీగా ఉన్న మన రాష్ట్రాన్ని బిల్డప్ ఏపీగా జగన్ రెడ్డి మారిస్తే తిరిగి సన్ రైజ్ ఏపీగా నేడు చంద్రబాబు మార్చారు. టీసీస్, బీపీసిల్, రిలయన్స్, గ్రీన్ కో, ఆర్సెలార్ మిట్టల్ నిప్పాన్ స్టిల్, పీపుల్ టెక్ వంటి ఎన్నో పరిశ్రమలు ఇప్పటికే మన రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టబోతున్నాయని అన్నారు.చంద్రబాబు పాలనలో పెట్టుబడులు పెట్టేందుకు పరిశ్రమలు స్థాపించేందుకు ఆంధ్రప్రదేశ్ స్వర్గదామిగా మారిందని అన్నారు.

శ్రీకృష్ణదేవరాయల జయంతిని అధికారికంగా నిర్వహించాలి

విశాలాంధ్ర - కర్నూలు: విజయనగర సామ్రాజ్యాధినేత, పరిపాలన దక్షుడు శ్రీకృష్ణ దేవరాయల జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని మాజీ రాజ్యసభ సభ్యులు టీజీ వెంకటేష్ కోరారు. శ్రీకృష్ణదేవరాయల 555 జయంతి సందర్భంగా స్థానిక గౌరీ గోపాల్ హాస్పిటల్ కూడలిలో ఉన్న విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. రాయల్ అఫీషియల్స్ ప్రొఫెషనల్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి టీజీ వెంకటేష్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ శ్రీకృష్ణదేవరాయల పరిపాలన కాలం స్వర్ణ యుగమని, ఆయన పాలనను నేటి పాలకులు ఆదర్శంగా తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఒకవైపు ప్రజలకు అవసరమైన సాగు,త్రాగునీటి కోసం ఎన్నో చెరువులు తవ్వించిన ఘనత ఆయనకే ఉందన్నారు. అవి నేటికీ వాడుకలో ఉంటూ ఇప్పటి ప్రజల అవసరాలు తీర్చడంలో ఎంతగానో ఉపయోగ పడుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో రాయల్ అఫీషియల్స్ ప్రొఫెషనల్ అసోసియేషన్ నాయకులు డాక్టర్ వై.సత్యనారాయణ, ఆర్జా రామకృష్ణ, కోనేటి చంద్రబాబు, చింతలపల్లి రామకృష్ణ, కోనేటి వెంకటేశ్వర్లు, మాజీ డీఎస్పీలు రామనాథ్, వెంకటేశ్వరరావు, కొట్టే చెన్నయ్య, విజయలక్ష్మి, జ్యోతిర్మయి తదితరులు పాల్గొన్నారు.